వీలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492

www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక




హైదరాబాద్ | సంచిక : 46 | సంపుటి : 2 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | సెప్టెంబర్ 2025 | పేజీలు : 08 | వెల : రూ 10/-





# అంగరంగ వైభవంగా నిమజ్జనోత్సవం



## ప్రశాంతంగా గంగమ్మ ఒడికి ఖైరతాబాద్ బడాగణేశ్


## సాగర్ వద్ద సందర్శకులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి నినాదాలు

ప్రజా స్వేచ్ఛ -సిటీబ్యూరో

హైదరాబాద్ నగరంలో గణేశ్ శోభాయాత్ర అంగరంగ వైభవంగా కొనసాగింది. జై బోలో గణేష్ మహారాజ్‌కీ జై అంటూ చిన్నాపెద్దా తేడా లేకుండా చేస్తున్న నృత్యాలు.. డ్యాన్స్ స్టెప్పులు, పీకల మోతలు, డప్పుచప్పుళ్లతో.. శంకర్‌కా భేటా.. ఘాడీమే బైటా.. అంటూ ప్రజల నినాదాలతో నగరంలో హొరెత్తిపోయింది. జంటనగరాలతోపాటు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి వచ్చిన వేలాది మంది ప్రజలతో ట్యాంక్‌బండ్ పరిసరాలు కిటకిటలాడాయి. శనివారం వేల సంఖ్యలో విగ్రహాలు హుస్సేన్ సాగర్‌తోపాటు పలు ప్రాంతాల్లో గణనాథులు గంగమ్మ ఒడికి చేరాయి. పలు రూపాల్లో కొలువైన గణనాథుని విగ్రహాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఖైరతాబాద్ మహాగణపతి శోభాయాత్రను చూడటానికి జనం భారీగా తరలిరావడంతో ట్యాంక్‌బండ్ పరిసర ప్రాంతాలు కిక్కిరిశాయి. నిమజ్జన ప్రక్రియను మంత్రి పొన్నం ప్రభాకర్, డీజీపీ జితేందర్, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, సీపీ సివి.ఆనంద్ హెలికాప్టర్‌లో ఏరియల్ వ్యూ ద్వారా పర్యవేక్షించారు. ట్యాంక్‌బండ్‌పై సీఎం రేవంత్ రెడ్డి, విపక్ష నేత కేసీఆర్ పేరుతో ఆలపించిన పాటలు హొరెత్తించాయి. దాంతో సందర్శకులు, రాజకీయ నాయకులు సైతం నృత్యాలు చేశారు. ఆదివారం ఉదయం వరకూ నిమజ్జన ప్రక్రియ కొనసాగనుంది. అయితే, డీజేలకు అనుమతిలేదంటూ పోలీసులు చెప్పినా.. గుండెలు అదిరే మైక్ సౌండ్స్ ఆగలేదు.

**ఆకస్మికంగా ట్యాంక్‌బండ్‌కు సీఎం**

వినాయక నిమజ్జనం నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆకస్మికంగా ట్యాంక్‌బండ్‌కు వచ్చి గణేష్ నిమజ్జనాలను పరిశీలించారు. ఎవరికీ ఎలాంటి సమాచారం ఇవ్వకుండా స్వయంగా సీఎం ట్యాంక్‌బండ్‌కు చేరుకుని భద్రతా ఏర్పాటను పరిశీలించారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని నేరుగా జనాన్ని అడిగి తెలుసుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి సాధారణ వ్యక్తిగా వచ్చిన సమాచారం అందుకున్న పోలీసులు, అధికారులు వెంటనే భద్రతా చర్యలను పటిష్టం చేశారు. ప్రజలకు అభివాదం చేస్తూ సీఎం ముందుకు కదిలారు. అత్యంత తక్కువ సంఖ్యలో భద్రత సిబ్బందితో మూడు కార్ల ఎస్కార్ట్‌తో సీఎం ట్యాంక్‌బండ్‌కు చేరుకున్నారు. గణేశ్ నిమజ్జనాల సందర్భంగా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్లాలని తెలిపారు. విగ్రహాల నిర్వాహకులు, ప్రజలు అధికారులకు సహకరించాలని సూచించారు. ఉత్సవ సమితి వేదికపైకి ఎక్కి గణపతి బప్పా మోరియా అంటూ నినాదాలు చేశారు.



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు
తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్
నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

వీలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492

www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక



హైదరాబాద్ | సంచిక : 46 | సంపుటి : 2 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | సెప్టెంబర్ 2025 | పేజీలు : 08 | వెల : రూ 10/-

# బై బై గణేశా

## గంగమ్మ ఒడికి చేరిన ఖైరతాబాద్ గణనాథుడు

### బాహుబలి క్రేన్ ద్వారా గంగమ్మ చెంతకు


- శనివారం మధ్యాహ్నం 1:30 గంటలలోపే హుస్సేన్ సాగర్ లో నిమజ్జనం
- భక్తులతో కిక్కిరిసిన క్రేన్ నెంబర్ 4 ప్రాంగణం
- ఖైరతాబాద్ బడా గణేష్ నిమజ్జనం పూర్తి



హైదరాబాద్ - ప్రజా స్వేచ్ఛ

అత్యంత ప్రతిష్టాత్మకమైన ఖైరతాబాద్ గణనాథుడి నిమజ్జనం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు లక్షలాది మంది భక్తుల సమక్షంలో మహా గణపతి ట్యాంక్‌బండ్‌లోని హుస్సేన్ సాగర్ నదిలోకి చేరారు. "గణపతి బప్పా మోరియా" నినాదాలతో హైదరాబాద్ నగరం మొత్తం మారుమోగిపోయింది. గణేశ్ నిమజ్జనానికి చాలా రోజుల ముందుగానే ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. నిమజ్జనం రోజు ఉదయం 7.30 గంటలకు బడా గణేశ్ శోభాయాత్ర ప్రారంభమైంది. విజయవాడ నుంచి ప్రత్యేకంగా తీసుకువచ్చిన ఒక భారీ వాహనంలో 70 టన్నుల గణనాథుడిని ఊరేగింపుగా ట్యాంక్‌బండ్‌కు తరలించారు. -మిగతా 3 లో



## నరేంద్రమోదీ గొప్ప ప్రధానమంత్రే..

- ప్రస్తుతం ఆయన చేస్తున్నది నాకు నచ్చడం లేదు
- ప్రధాని మోదీతో నేను ఎప్పుడూ స్నేహంగానే ఉంటా.
- భారత్-అమెరికా దేశాల మధ్య ప్రత్యేకమైన బంధం ఉంది
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శనివారం కిలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ,-

భారత్ పై అమెరికా భారీ సుంకాలు విధించడంతో రెండు దేశాల మధ్య సంబంధాలు ఇటీవల బలహీనపడ్డాయి. ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శనివారం కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాని నరేంద్రమోదీ ని పొగిడినట్టే పొగిడి, అతడి తీరు నచ్చలేదని వ్యాఖ్యానించారు.ట్రంప్ శుక్రవారం వైట్‌హౌస్‌లో సీఈవోలకు ఇచ్చిన విందు సందర్భంగా మాట్లాడుతూ.. భారత్, రష్యాలకు దూరమయ్యాం అంటూ తన ట్రూత్ సోషల్‌లో పోస్టు పెట్టారు. ఆ రెండు దేశాలు చైనా చీకటి వలయంలో చిక్కుకున్నాయని పేర్కొన్నారు. దీనిపై శనివారం మీడియా ప్రశ్నించగా ఆయన స్పందించారు. రష్యా నుంచి భారత్ పెద్ద మొత్తంలో చమురు కొనుగోలు చేస్తోందని, అది తనను చాలా నిరాశకు గురిచేసిందని చెప్పారు. రష్యా చమురు కొనుగోలు చేయవద్దని భారత్‌కు తాను చెప్పానని, అయినా వెనక్కి తగ్గకపోవడంతో భారత దిగుమతులపై పెద్ద మొత్తంలో టారిఫ్‌లు విధించానని ట్రంప్ తెలిపారు. అయితే తాను -మిగతా 3 లో


## నిమజ్జనోత్సవాల్లో సీఎం రేవంత్

### సాధారణ వ్యక్తిగా ట్యాంక్ బండ్ పైకి

- ఆకస్మికంగా వచ్చి పరిశీలించిన రేవంత్
- భక్తులకు అభివాదం చేస్తూనే సూచనలు

హైదరాబాద్, - ప్రజా స్వేచ్ఛ

హుస్సేన్ సాగర్ వద్ద నిమజ్జనాలను పరిశీలించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా పరిశీలించారు. భక్తులు, సందర్శకులు క్షేమంగా ఇళ్లకు చేరుకోవాలని సీఎం విజ్ఞప్తి చేశారు. భాగ్యనగర్ ఉత్సవ సమితి వేదికపై నుంచి భక్తులకు అభివాదం చేశారు. 'గణపతి బప్పా మోరియా' అంటూ భక్తులతో కలిసి నినాదాలు చేశారు. క్రేన్ నెం.4వద్ద నిమజ్జనాలను పరిశీలించారు. నిమజ్జనం ఏర్పాట్లను కలెక్టర్ హరిచందన సీఎంకు వివరించారు.



ఈ సందర్భంగా విధుల్లో పాల్గొన్న అన్ని విభాగాల సిబ్బందిని సీఎం అభినందించారు. నిమజ్జనాలు పూర్తయ్యే వరకు ఇదే స్ఫూర్తితో పనిచేయాలని సూచించారు. ముందస్తు సమాచారం -మిగతా 3 లో

## ఫామ్‌హౌస్‌లో కీలక భేటీ

- ఫామ్‌హౌజ్‌లో కేసీఆర్ సుదీర్ఘ చర్చలు
- కేటీఆర్, హరీష్ రావులతో మంతనాలు

గజ్వేల్, -

భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్‌తో మాజీ మంత్రి హరీశ్‌రావు సమావేశమయ్యారు. ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌కు వెళ్లి ఆయనతో ప్రత్యేకంగా భేటీ-అయ్యారు. ఇప్పటికే కేటీఆర్ సహా పలువురు పార్టీ ప్రముఖులు అక్కడ ఉన్నారు. ఇటీవల అసెంబ్లీలో చోటు-చేసుకున్న పరిణామాలు, కాళేశ్వరంపై దర్యాప్తును సీబీఐకి అప్పగించడం, ఎమ్మెల్సీ పదవికి, భారత రాష్ట్ర సమితి పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి కవిత రాజీనామా చేయడం తదితర



అంశాలపై వీరు చర్చించినట్లు-తెలుస్తోంది. ఎర్రవల్లిలోని మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో సుదీర్ఘంగా చర్చలు కొనసాగాయి. మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేసీఆర్ భేటీ అయిన విషయం తెలిసిందే. ఈ సమావేశంలో తాజా రాజకీయ పరిస్థితులపై -మిగతా 3 లో

## రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో చర్చించాకే శ్లాబులు

- జీఎస్టీ శ్లాబులపై నిర్మలా సీతారామన్ వివరణ
- ధరలు దిగివచ్చి..సామాన్యులకు మేలుచేస్తుందని వెల్లడి



న్యూఢిల్లీ, -

జీఎస్‌టి శ్లాబులు 5, 12,18, 28 శాతంగా ఉండేవి. అయితే ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నట్టుగా ఈ శ్లాబుల విధానం బిజెపి నిర్ణయం కాదని, రాష్ట్ర ఆర్థిక మంత్రుల సాధికార కమిటీ-తీసుకున్నదని శనివారం కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. నాలుగు శ్లాబుల విధానంపై ప్రతిపక్ష పార్టీలు దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆమె శనివారం అన్నారు. నాలుగు శ్లాబుల విధానం కాస్తా.. తాజాగా జరిగిన -మిగతా 3 లో



## ట్రంప్‌కు మోడీ మరో షాక్?

- ఐక్యరాజ్యసమితి సమావేశాలకు దూరం

న్యూఢిల్లీ -

అమెరికా అధిక టారిఫ్‌ల వేళ భారత్ తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నెలాఖరులో అమెరికాలో జరగనున్న ఐక్యరాజ్యసమితి 80వ జనరల్ అసెంబ్లీ సమావేశాలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హాజరు కావాల్సి ఉన్న విషయం తెలిసిందే. అయితే, ఈ సమావేశాలకు మోదీ హాజరు కావడం లేదని తెలిసింది. ఆయనకు బదులు విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ ఈ సమావేశాల్లో ప్రసంగించనున్నట్లు తాజా సమాచారం. సెప్టెంబర్ 9వ తేదీ నుంచి ఐక్యరాజ్యసమితి 80వ జనరల్ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభంకానున్నాయి. హై లెవల్ డిబేట్ మాత్రం సెప్టెంబర్ 23 నుంచి 29 వరకు జరగనున్నది. చర్చలో పాల్గొనే వక్తల జాబితాను తాజాగా యూఎన్ గత నెల రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. తొలుత బ్రెజిల్ చర్చను ప్రారంభిస్తుంది. ఆ తర్వాత అమెరికా మాట్లాడుతుంది. సెప్టెంబర్ 23వ తేదీన యూఎన్జీఏ పోడియం నుంచి డోనాల్డ్ ట్రంప్ ప్రపంచ నేతలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. -మిగతా 3 లో

## కమిషన్లు రావనే పేదలకు ఇళ్లు కట్టలేదు

### రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేసారు

- కాళేశ్వరంతో కమిషన్లు లాగారు
- మంత్రి పొంగులేటి ఘాటు విమర్శలు



వనపర్తి,- ప్రజా స్వేచ్ఛ

కల్వకుంట్ల కుటుంబం పదేళ్లలో భారీగా అవినీతికి పాల్పడిందని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. పేదలకు ఇళ్లు కడితే కమిషన్లు రావని కాళేశ్రం కట్టారని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం పదేళ్లలో 8 లక్షల 19 వేల కోట్ల రూపాయల అప్పుల భారం ప్రజలపై మోపిందని ఆక్షేపించారు. శనివారం వనపర్తి జిల్లాలోని పెద్దమందడి మండలం మంగంపల్లిలో ఇందిరమ్మ ఇండ్లకు గృహప్రవేశం చేశారు. -మిగతా 3 లో

## 35 లక్షలకు బాలాపూర్ గణేశ్ లడ్డూ

### ఏళకలుగా లడ్డూ కోసం యత్నిస్తున్న దశరథ గౌడ్



3 లో

## విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలి

- సిరిసిల్ల జేఎన్టీయూలో శాశ్వత భవనాలు నిర్మించాలి
- సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, వీసీతో ఫోన్‌లో సంప్రదించిన కేటీఆర్

3 లో



## కవిత ఓ కొరివి దయ్యం

- బీఆర్ఎస్ హయాంలో వేల కోట్ల రూపాయలు దోచుకున్నారు
- కవిత కొంత దాచిపెట్టి.. కొంత మూసిపెట్టి మాట్లాడుతున్నారు
- మంత్రి జూపల్లి విమర్శలు



జోగులాంబ గద్వాల -

మాజీ సీఎం కేసీఆర్ చుట్టూ దెయ్యాలు ఉన్నాయని అన్న కవిత కూడా ఓ కొరివి దయ్యం అంటూ మంత్రి జూపల్లి కృష్ణారావు సంచలన వ్యాఖ్యలు చేశారు. గత బీఆర్ఎస్ హయాంలో వేల కోట్ల రూపాయలు దోచుకున్నారని కవితనే చెప్పారని తెలిపారు. తాను ఆనాడు మంత్రి పదవి కోసం బీఆర్ఎస్ పార్టీలోకి రాలేదని పేర్కొన్నారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని పాతర వేసిందని విమర్శించారు. కవిత కొంత దాచిపెట్టి.. కొంత మూసిపెట్టి మాట్లాడుతున్నారని జూపల్లి ఆరోపించారు. జిల్లా కేంద్రంలో 2-ఇబిఔ ఇళ్ల గృహ ప్రవేశం కార్యక్రమం సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి అధ్యక్షతన బహిరంగ -మిగతా 3 లో

# ఆపరేషన్ సిందూర్ 3 రోజుల్లో ముగిసిపోలేదు.

భారత ఆర్మీ చీఫ్ ద్వివేది



**న్యూఢిల్లీ -- ప్రజా స్వేచ్ఛ**

జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో పాక్ ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌పై మన దేశం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది శుక్రవారం ఒక కొత్త విషయాన్ని వెల్లడించారు. అందరూ అనుకుంటున్నట్టుగా పాక్‌తో మే 7న ప్రారంభమైన యుద్ధం మే 10న మూడు రోజుల్లో ముగిసిపోలేదని ఆయన తెలిపారు.న్యూఢిల్లీలో ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన ఒక పుస్తకావిష్కరణ సభకు హాజరైన ఆయన 'మీరంతా మే 10న యుద్ధం ముగిసింది అనుకుంటున్నారు.. కానీ అది తప్పు. అది చాలా కాలం కొనసాగింది. ఎందుకంటే దానికి అంతకు మించి ఎన్నో నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది.

# ఎర్ర కోటలో భారీ చోరీ


రూ.1.5 కోట్ల బంగారు కలశాలు మాయం



**న్యూఢిల్లీ - -- ప్రజా స్వేచ్ఛ**

దేశ రాజధానిలో భారీ చోరీ జరిగింది. ఎర్ర కోట ప్రాంగణంలో ఓ మతపరమైన కార్యక్రమంలో రూ.1.5 కోట్ల విలువైన బంగారు కలశాలు చోరీకి గురయ్యాయి. జైన పూజారి వేషంలో వచ్చిన దొంగ బంగారు వస్తువులతో ఉడాయించినట్లు సీసీటీవీ ఫుటేజీ బయటపెట్టింది. అనుమానితుడిని గుర్తించామని, త్వరలోనే అరెస్టు చేస్తామని పోలీసులు చెప్పారు.ఆగస్టు15న పార్కు వద్ద దస్లక్షన్ మహోత్సవ పేరిట జైన మతస్థులకు చెందిన 10 రోజుల ఉత్సవాలు జరుగుతున్నాయి. గత బుధవారం పూజా క్రతువు కోసం ఏర్పాట్లు జరుగుతుండగా ఈ చోరీ జరిగింది. ఓ బంగారు కలశం, 760 గ్రాముల బరువున్న బంగారు కొబ్బరికాయ, మరో 115 గ్రాముల బరువుతో వజ్రాలు, ఎమెరాల్డ్స్, రూబీలు పొదిగిన చిన్న బంగారు కలశంతో సహా విలువైన పూజా పాత్రలు మాయమయ్యాయి

# నేడు సంపూర్ణ చంద్ర గ్రహణం



**న్యూఢిల్లీ -- ప్రజా స్వేచ్ఛ**

నేడు (ఆదివారం) సంపూర్ణ చంద్ర గ్రహణం ఏర్పడనుంది. దీనిని 'బ్లడ్ మూన్' అని పిలుస్తారు. సూర్యుడు, భూమి, చంద్రుడు ఒకే సరళ రేఖపైకి వచ్చినపుడు, భూమి నీడ చంద్రునిపై పడుతుంది. అప్పుడు గాఢమైన ఎరుపు రంగు దర్శనమిస్తుంది. భారత్, చైనా సహా ఆసియా దేశాల్లో, ఆఫ్రికాలోని తూర్పు ప్రాంతాల్లో, పశ్చిమ ఆస్ట్రేలియాలో ఈ సంపూర్ణ చంద్ర గ్రహణం కనిపిస్తుంది.ఈ గ్రహణం భారత్‌లో ఆదివారం రాత్రి 11 గంటలకు ప్రారంభమై, అర్ధరాత్రి 12.22 గంటలకు ముగుస్తుంది. స్పర్శ కాలం ఆదివారం రాత్రి 10.01 గంటలకు ప్రారంభమవుతుంది. యూరోప్, ఆఫ్రికా దేశాల్లో పాక్షిక చంద్ర గ్రహణం కనిపిస్తుంది. అమెరికాలో ఇది కొంచెం కూడా కనిపించదు.

# అరుదైన బ్రెయిన్ ఇన్ఫెక్షన్‌తో కేరళలో మరొకరు మృతి

**తిరువనంతపురం**

**- ప్రజా స్వేచ్ఛ )**



: అరుదైన, ప్రాణాంతకమైన మెదడు ఇన్ఫెక్షన్‌తో కొజికోడ్ మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 45ఏళ్ళ వ్యక్తి మరణించాడని ఆరోగ్య శాఖాధికారులు శనివారం చెప్పారు. మృతుడిని వాయనాడ్‌కి చెందిన రాథేష్‌గా గుర్తించారు. హృదయ సంబంధమైన సమస్యలతో కూడా ఆయన బాధపడుతున్నారని వారు తెలిపారు. ఇదే వ్యాధి లక్షణాలతో కొజికోడ్ మెడికల్ కాలేజీలో 11మంది చికిత్స పొందుతున్నారని చెప్పారు. ఆగస్టు మాసంలో బ్రెయిన్ ఫీవర్‌తో ముగ్గురు మరణించారు. ఈ మరణాల నేపథ్యంలో ఈ వ్యాధి చికిత్స కోసం కేరళ ఆరోగ్య శాఖ ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసింది. కలుషితమైన నీటిలో వుండే అమీబా వల్ల ఈ అరుదైన బ్రెయిన్ ఇన్ఫెక్షన్ వస్తుంది. కాలుష్య నీటిలో ఈదినా లేదా స్నానం చేసినా ఈ వైరస్ సోకే ప్రమాదముందని అధికారులు చెప్పారు.

# భారత ఐటీకి ట్రంప్ షాక్!

-కాంట్రాక్టులు నిలిపేసే అంశాన్ని పరిశీలిస్తున్నాం: ఫార్ రైట్ కార్యకర్త లారా లూమర్
-భారత్‌పై అమెరికా అధ్యక్షుడి వ్యూహాత్మక అడుగులు
-పైకి పొగుడుతూనేఆంక్షలు
-అదే జరిగితే లక్షల మంది భారతీయులకు కష్టకాలం
-భారత్‌పై విషాన్ని కక్కుతున్న డొనాల్డ్ ట్రంప్ సన్నిహితులు
-ట్రంప్ వ్యంగ్య ప్రకటనలను పొగడ్తలుగా భావిస్తున్న నరేంద్ర మోదీ పరివారం
-పొంగిపోవడం మానేసి దౌత్యపర పరిష్కారాలను వెతకాలి: నిపుణుల సూచన



**న్యూఢిల్లీ,- ప్రజా స్వేచ్ఛ**

'నోటితో నవ్వుతూ.. నొసటితో వెక్కిరించే' తరహాలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వైఖరి కొనసాగుతున్నది. భారత్ తన మిత్ర దేశమని, ప్రధాని మోదీ గొప్ప ప్రధాని అని ఒక పక్క వ్యంగ్యంగా పొగుడుతూనే మరోవైపు భారత్‌పై కక్ష సాధింపు, ప్రతీకార చర్యలను ట్రంప్ కొనసాగిస్తూనే ఉన్నారు. అమెరికన్ కంపెనీలు భారత ఐటీ సంస్థలకు ఇచ్చే కాంట్రాక్టులను నిలిపివేసే అంశాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పరిశీలిస్తున్నారని ఫార్ రైట్ కార్యకర్త లారా లూమర్ తెలపడమే ఇందుకు నిదర్శనం. ఈ నిర్ణయం అమలైతే భారత ఐటీ రంగానికి గట్టి ఎదురుదెబ్బ తగిలే అవకాశం ఉంది. దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషించే ఐటీ రంగం అమెరికన్ సంస్థల నుంచి వచ్చే కాంట్రాక్టులపైనే ఎక్కువగా ఆధారపడి ఉంది.ఈ చర్య వల్ల భారతదేశంలో సాంకేతిక, సపోర్ట్, బ్యాక్‌ఎండ్ రంగాల ఉద్యోగులకు గడ్డు పరిస్థితి ఎదురయ్యే అవకాశం ఉంది. 'అమెరికన్ ఐటీ కంపెనీలు తమ పనులను భారతీయ కంపెనీలకు అవుట్ సోర్సింగ్ చేయకుండా నిలిపివేయడం గురించి అధ్యక్షుడు ట్రంప్ ఆలోచిస్తున్నారు' అని లూమర్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. అంతేకాకుండా, కస్టమర్ సర్వీస్‌కు ఫోన్ చేసినప్పుడు ఇంగ్లిష్ కోసం నంబర్ ప్రెస్ చేయాల్సిన అవసరం అమెరికన్లకు ఇకపై ఉండకపోవచ్చని లూమర్ పేర్కొన్నారు. వేరే మాటల్లో చెప్పాలంటే, 'మీరు ఇంగ్లిష్ కోసం 2 నొక్కాల్సిన అవసరం లేదు' అని రాసుకొచ్చారు. కాల్ సెంటర్లను మళ్లీ అమెరికావిగా చేద్దాం! అని పిలుపునిచ్చారు. ఇటీవల అమెరికన్ కార్యకర్త జాక్ పోసోబిక్ కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. విదేశీ రిమోట్ కార్మికులు, అవుట్ సోర్సింగ్‌పై పన్నులు విధించాలని సూచించారు. వస్తువుల మాదిరిగానే, సేవలను కూడా రిమోట్‌గా అమెరికాకు అందించడానికి దేశాలు రుసుము చెల్లించాలి. ఈ పద్ధతిని అన్ని పరిశ్రమలకు వర్తింపజేయాలి అని ఆయన పేర్కొన్నారు.మరోపక్క ట్రంప్ సలహాదారులు తమ ప్రకటనలతో భారత్‌పై విషం కక్కుతూనే ఉన్నారు. రెండు నెలల్లో ట్రంప్‌నకు భారత్ క్షమాపణ చెప్పి కాళ్లబేరానికి రావడం ఖాయమంటూ దిగజారుడు ప్రకటనలు చేస్తూ మరింత రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. ఒకవైపు పొగుడుతూనే మరోవైపు సుంకాల బాదుడు వంటి కఠిన నిర్ణయాలతో దేనిదారి దానిదే అన్నట్టుగా ట్రంప్ ద్వంద్వ వైఖరితో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. అయితే, వ్యంగ్యంగా చేసిన ట్రంప్ ప్రకటనలను కూడా పొగడ్తలుగా మార్చి అదేదో తమ గొప్పగా చెప్పుకొనేందుకు మోదీ పరివారం ఆరాటపడుతున్నది.ట్రంప్‌తో మోదీకి బలమైన సంబంధాలు ఉన్నాయని, అమెరికాతో భాగస్వామ్యానికి ఆయన ప్రాధాన్యత ఇస్తారని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ప్రకటించడం ఇందుకు ఉదాహరణ. మొత్తంగా ట్రంప్ పొగడ్తలకు మురిసిపోతే.. భారత్ మునుగుడే అన్న భావన సర్వత్రా వ్యక్తమవుతున్నది. భారత్‌పై ట్రంప్ మరిన్ని కఠిన చర్యలకు ఉపక్రమించకముందే దౌత్యపరమైన పరిష్కారాలను మోదీ ప్రభుత్వం వెదుకాల్సిన అవసరాన్ని నిపుణులు ఈ సందర్భంగా నొక్కి చెప్తున్నారు.

# పాక్‌కు చైనా బిగ్ షాక్..
# రూ.5 లక్షల కోట్ల సీపీఈసీ ప్రాజెక్టు నుంచి బయటకు



**న్యూఢిల్లీ,- ప్రజా స్వేచ్ఛ**

చైనాతో భారత్ బంధం బలపడుతున్న వేళ పాకిస్థాన్‌కు చైనా నుంచి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పాకిస్థాన్‌కు చెందిన అత్యంత ప్రతిష్టాత్మక చైనా-పాకిస్థాన్ ఆర్థిక కారిడార్(సీపీఈసీ)లో భాగమైన మెయిన్ లైన్-1(ఎంఎల్-1) రైల్వే ఆధునీకరణ ప్రాజెక్టు నుంచి చైనా తప్పుకుంది. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఇటీవల చైనాను సందర్శించగా సీపీఈసీ ఫేస్-2 కింద నిధులు సాధించడంలో, కొత్త ప్రాజెక్టులు పొందడంలో విఫలమయ్యారు.

నికి బదులుగా వ్యవసాయం, ఎలక్ట్రిక్ వాహనాలు, సోలార్ ఎనర్జీ, ఉక్కు వంటి రంగాలలో 850 కోట్ల డాలర్ల(భారతీయ కరెన్సీలో రూ. 7,500 కోట్లు) అవగాహనా ఒప్పందాలను మాత్రం చైనాతో కుదుర్చుకోగలిగారు. కాగా, ఒకపక్క అమెరికాతో పాకిస్థాన్ అంటకాగడం, మరోపక్క ఇటీవల టియాంజిన్‌లో జరిగిన షాంఘై సహకారం సంస్థ(ఎస్‌సీఓ) శిఖరాగ్ర సదస్సులో చైనా, రష్యాతో భారత్ సంబంధాలు బలపడడం వంటి పరిణామాల నేపథ్యంలో భౌగోళిక రాజకీయ మార్పు చోటుచేసుకుంది.

**ఏమిటీ ప్రాజెక్టు ?**

చైనాకు చెందిన వాయువ్య నిన్‌జియాంగ్ ప్రాంతాన్ని పాకిస్థాన్‌కు చెందిన అరేబియా సముద్ర రేవు గ్వదార్‌ను కలిపే లక్ష్యంతో ఈ ప్రధాన మౌలిక సౌకర్యాల కల్పన ప్రాజెక్టుకు రూ.5.29 లక్షల కోట్ల(6,000 కోట్ల డాలర్ల) అంచనా వ్యయంతో రూపకల్పన జరిగింది. ఈ ప్రాజెక్టులో భాగంగా రోడ్లు, రైల్వే లైన్లు, పైప్‌లైన్లు, విద్యుత్ ప్రాజెక్టులు నిర్మించాల్సి ఉంటుంది. దాదాపు 3,000 కిలోమీటర్ల పొడవైన చైనా-పాకిస్థాన్ ఆర్థిక కారిడార్ చైనాకు చెందిన బెల్ట్ అండ్ రోడ్డు ఇనిషేటివ్(బీఆర్ఐ)లో కీలకమైన భాగం. దక్షిణాసియా, మధ్య ఆసియా, పశ్చిమాసియా, ఆఫ్రికాలను కలపడం ద్వారా ప్రాంతీయ కనెక్టివిటీని పెంచడానికి ఈ ప్రాజెక్టు తోడ్పడుతుందని అంచనా. చైనా, పాకిస్థాన్ మధ్య వాణిజ్యాన్ని పెంపొందించడంతోపాటు చైనా ఇంధన దిగుమతులకు ఇది తోడ్పడగలదని భావిస్తున్నారు. ఎంఎల్-1 రైల్వే ప్రాజెక్టు నుంచి చైనా తప్పుకోవడంతో రుణం కోసం ఆసియన్ అభివృద్ధి బ్యాంకును ఆశ్రయించాలని పాక్ భావిస్తున్నట్లు తెలుస్తోంది.

# ఫ్రాన్స్ అధ్యక్షుడికి మోడీ ఫోన్

ఉక్రెయిన్ సహా పలు అంశాల ప్రస్తావన



**న్యూఢిల్లీ - ప్రజా స్వేచ్ఛ**

ప్రధాని నరేంద్ర మోడీ శనివారం ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మాక్రాన్‌తో ఫోన్లో మాట్లాడారు. ఉక్రెయిన్ యుద్ధానికి త్వరగా ముగింపు పలికేందుకు ప్రస్తుతం జరుగుతున్న ప్రయత్నాలపై ఇరువురు నేతలు పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నారు. భారత్, ఫ్రాన్స్ సంబంధాలను సమీక్షించారు.

ఉక్రెయిన్ విషయంలో ట్రంప్ తీసుకుంటున్న తాజా చొరవల నేపథ్యంలో ఈ ఫోన్ సంభాషణ చోటు చేసుకుంది. గత నెల్లో వైట్‌హౌస్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ట్రంప్ చర్చలు జరిపే సమయంలో వున్న యురోపియన్ నేతల్లో మాక్రాన్ కూడా వున్నారు.

అధ్యక్షుడు మాక్రాన్‌తో మంచిగా సంభాషణ సాగింది. వివిధ రంగాల్లో ద్వైపాక్షిక సహకార పురోగతిపై సమీక్షించామని మోడీ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. అంతర్జాతీయ, ప్రాంతీయ అంశాలపై అభిప్రాయాలు పంచుకున్నాం. అంతర్జాతీయ శాంతి సుస్థిరతలను నెలకొల్పడంలో భారత్, ఫ్రాన్స్ వ్యూహాత్మక భాగస్వామ్యం కీలకపాత్ర పోషిస్తుందని మోడీ ఆ పోస్టులో వ్యాఖ్యానించారు. అయితే అమెరికా టారిఫ్ విధానం పర్యవసానాలు వారి మధ్య చర్చకు వచ్చిందా లేదా అన్నది తెలియరాలేదు.


# 102 ఏళ్ల వయస్సులో మౌంట్ ఫుజీని అధిరోహించిన వృద్ధుడు..!



**న్యూఢిల్లీ,- ప్రజా స్వేచ్ఛ**

ఈ రోజుల్లో 60 ఏళ్లు దాటితో దేహం రోగాల పుట్టగా మారుతున్నది. కొద్దిమంది మినహా చాలామంది బీపీ , షుగర్ , థైరాయిడ్ లాంటి రోగాల బారిన పడుతున్నారు. కొందరిలో అయితే 40 ఏళ్లకే ఇలాంటి అనారోగ్య సమస్యలు బయటపడుతున్నాయి. ఎక్కువగా శారీరక శ్రమ లేకపోవడం, మారిన ఆహారపు అలవాట్లు లాంటివి ఈ జీవనశైలి వ్యాధులకు కారణమవుతున్నాయి. కానీ జపాన్ దేశానికి చెందిన ఓ వృద్ధుడు మాత్రం 102 ఏళ్ల వయసులో కూడా ఆరోగ్యంగా ఉన్నారు. అంతేకాదు ఈ వయసులో ఏకంగా మౌంట్ ఫుజీ ని అధిరోహించి గిన్నెస్ బుక్‌లో చోటుసంపాదించారు.జపాన్ దేశానికి చెందిన 102 ఏళ్ల వృద్ధుడు కొకిచీ అకుజావా వయస్సు ప్రస్తుతం 102 ఏళ్లు. మన దేశంలో అయితే ఈ వయసులో అసలు బతికి ఉండటమే అరుదు. కానీ అకుజావా మాత్రం ఏకంగా 3,776 మీటర్ల ఎత్తున్న మౌంట్ ఫుజీ పర్వతాన్ని అధిరోహించారు. దాంతో మౌంట్ ఫుజీని అధిరోహించిన అతిపెద్ద వయస్కుడిగా రికార్డు సృష్టించారు. అకుజావా ఘనతను 'గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్' సంస్థ కూడా గుర్తించింది. కాగా, కొంత ఇబ్బందిగా అనిపించడంతో తాను మధ్యలోనే పర్వతారోహణను ఆపేయాలని అనుకున్నానని, కానీ చుట్టూ ఉన్నవారి ప్రోత్సాహంతో ముందుకు సాగానని అకుజావా చెప్పారు. కాగా అకుజావా 96 ఏళ్ల వయసులో కూడా ఓసారి ఈ పర్వతాన్ని అధిరోహించారు.

# ఇజ్రాయిల్ దాడులకు 50 మందికి పైగా పాలస్తీనియన్లు మృతి



**గాజా- ప్రజా స్వేచ్ఛ**

: వేలాది మంది పాలస్తీనియన్లు మృతి చెందినా ఇజ్రాయిల్ మారణహోమాన్ని ఆపడం లేదు. తాజాగా గాజాపై శుక్రవారం జరిపిన దాడుల వల్ల ఏడుగురు చిన్నారులతో సహా 50 మందికిపైగా పాలస్తీనియన్లు మృతి చెందారు. అలాగే శనివారం తెల్లవారుజాము నుంచే ఇజ్రాయిల్ దాడులకు పాల్పడింది. ఉత్తర గాజాలోని పాలస్తీనియన్ల ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసింది. గాజా నగరంలో జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతంలో ఒక ఎత్తైన భవనాన్ని ఇజ్రాయిల్ సైన్యం ధ్వంసం చేసింది.దీంతో అక్కడ కూడా నరక ద్వారాలు తెరుచుకున్నాయని ఇజ్రాయిల్ రక్షణశాఖా మంత్రి ఇటామర్ బెన్-గ్విర్ అన్నారు. శనివారం అల్ షిఫా ఆసుపత్రిపై జరిపిన దాడిలో ఒక చిన్నారుతో సహా ఐదుగురు మృతి చెందారు. అలాగే అల్ షుహదా స్క్వేర్‌కు పశ్చిమాన ఉన్న శరణార్థి శిబిరంపై ఇజ్రాయిల్ సైన్యం బాంబుదాడికి పాల్పడడంతో ఐదుగురు మృతి చెందారు. పలువురికి గాయాలయ్యాయి. కాగా, అక్టోబర్ 7, 2023లో మొదలైన గాజాపై ఇజ్రాయిల్ దాడిలో అధికారిక లెక్కల ప్రకారం 64,300 మంది చనిపోయారు. 162,005 మంది గాయాలపాలయ్యారు.

## నరేంద్రమోదీ గొప్ప ప్రధానమంత్రే..

(మొదటి తరువాయి)

భారత్‌పై విధించిన 50 శాతం సుంకాలు చాలా ఎక్కువేనని ఆయన అంగీకరించారు. ప్రధాని నరేంద్రమోదీతో తనకున్న వ్యక్తిగత సంబంధాల గురించి కూడా ట్రంప్ ప్రస్తావించారు. 'భారత్‌తో సంబంధాల పునరుద్ధరణకు సిద్ధంగా ఉన్నారా..?' అని మీడియా ప్రశ్నించగా.. 'కచ్చితంగా' అని ట్రంప్ బదులిచ్చారు. 'నేను ఎప్పుడూ అదే కోరుకుంటా. ప్రధాని మోదీతో నేను ఎప్పుడూ స్నేహంగానే ఉంటా. ఆయన గొప్ప ప్రధాని. కానీ.. ప్రస్తుతం ఆయన చేస్తున్నది నాకు నచ్చడం లేదు. భారత్‌-అమెరికా దేశాల మధ్య ప్రత్యేకమైన బంధం ఉంది. దీనిపై ఆందోళన అవసరం లేదు' అని చెప్పారు. ఇటీవల మోదీ అమెరికాలో పర్యటించిన విషయాన్ని కూడా ట్రంప్ గుర్తుచేశారు. శుక్రవారం ఆయన ట్రూత్ సోషల్‌లో.. 'భారత్, రష్యాలను అమెరికా కోల్పోయింది. అవి రెండూ చైనా చీకటి వలయంలో చిక్కుకున్నాయి' అని పేర్కొన్నారు. ఆ పోస్టుతోపాటు ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌లు కలిసి ఉన్న ఫొటోను కూడా ట్రంప్ పంచుకున్నారు. ఆ మూడు దేశాలు సుదీర్ఘ, సుసంపన్న భవితవ్యం కలిగి ఉండాలని కోరుకుంటున్నట్లు వ్యంగ్య కామెంట్స్ చేశారు.

## నిమజ్జనోత్సవాల్లో సీఎం రేవంత్

లేకుండా సాదాసీదాగా సీఎం రేవంత్‌రెడ్డి హుస్సేన్ సాగర్ వద్ద ప్రత్యక్ష కావడంతో భక్తులు ఆశ్చర్యానికి గురయ్యారు. గణేశ్ నిమజ్జనాల సందర్భంగా హుస్సేన్ సాగర్ వద్దకు సీఎం వచ్చి ఏర్పాట్లను పరిశీలించడం పట్ల భాగ్యనగర్ ఉత్సవ్ సమితి ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. నగర వ్యాప్తంగా వినాయక నిమజ్జనాలు అంగరంగ వైభవంగా కొనసాగాయి. ఈ నేపథ్యంలో ట్యాంక్‌బండ్ వద్ద జరుగుతున్న గణేష్ నిమజ్జనాల వేడుకను సీఎం రేవంత్ రెడ్డి సందర్శించారు. ఎవరికీ ఎలాంటి సమాచారం ఇవ్వకుండా స్వయంగా ట్యాంక్‌బండ్‌కు సీఎం వచ్చినట్లు- సమాచారం. నిమజ్జనాల నేపథ్యంలో అధికారులు చేసిన భద్రత ఏర్పాట్లను సీఎం పరిశీలించారు. అనంతరం ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని భక్తులను అడిగి తెలుసుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి సాధారణ వ్యక్తిగా ట్యాంక్ బండ్ వద్దకు వచ్చి నిమజ్జనం ఏర్పాట్లు- పరిశీలించారు. రేవంత్ రెడ్డి రావడంతో భారీగా ప్రజలు తరలివచ్చారు. ప్రజలకు అభివాదం చేస్తూ.. ముందుకు కదిలారు. అత్యంత తక్కువ సంఖ్యలో భద్రత సిబ్బందితో.. మూడు కార్ల ఎస్కార్ట్‌తో సీఎం ట్యాంక్‌బండ్‌కు చేరుకున్నారు. నిమజ్జనం జరుగుతున్న తీరును అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. గణేశ్ నిమజ్జనాల సందర్భంగా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్లాలని తెలిపారు. వినాయక నిర్వాహకులు, ప్రజలు అధికారులకు సహకరించాలని సీఎం స్పష్టం చేశారు.

## ఫామ్‌హౌస్‌లో కీలక భేటీ

చర్చిస్తున్నట్లు- తెలుస్తోంది. హరీష్ రావుపై మాజీ ఎమ్మెల్సీ కవిత చేసిన ఆరోపణలపై ఆసక్తికర చర్చ జరుగుతున్నట్లు- సమాచారం. కాళేశ్వరం ప్రాజెక్టును సీబీఐకి ప్రభుత్వం అప్పగించిన విషయంపై ఆదివారం కూడా సమావేశాలు కొనసాగే అవకాశం ఉంది. కొద్దిసేపటి క్రితమే.. ఫామ్ హౌస్ నుంచి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వెళ్లినట్లు- సమాచారం. అయితే.. ఫామ్ హౌస్‌లోనే హరీష్ రావు, కేటీఆర్ ఉండనున్నట్లు- తెలుస్తోంది. ఈ మేరకు రేపటి సమావేశాల తరువాత మీడియా సమావేశం లేదా ప్రకటన విడుదల చేసే అవకాశం ఉంది. అయితే మాజీ ఎమ్మెల్సీ కవిత చేసిన ఆరోపణలపై తాజాగా మాజీ మంత్రి హరీష్ రావు స్పందించిన విషయం తెలిసిందే. తన రాజకీయ జీవితం తెరిచిన పుస్తకమని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో తన నిబద్ధత అందరికీ తెలుసునని చెప్పుకొచ్చారు. ప్రజల ఆకాంక్షల మేరకే పనిచేయాల్సిన బాధ్యత తనపై ఉందని నొక్కిచెప్పారు. తెలంగాణ అభివృద్ధిలో ఓ కార్యకర్తలాగా తాను పాతికేళ్లు పనిచేశానని వ్యాఖ్యానించారు. తనపై, పార్టీపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. తనపై చేసిన ఆరోపణలను వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని పేర్కొన్నారు. తనపై దిగజారుడు రాజకీయాలు మంచిది కాదని హరీష్‌రావు హితవు పలికారు. ఈ నేపథ్యంలో ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో నిర్వహిస్తున్న సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే సమావేశాల అనంతరం బీఆర్‌ఎస్ ఎలాంటి ప్రకటన చేస్తోంది అనే దానిపై సర్వాత్ర ఉత్కంఠ నెలకొంది.

## ట్రంప్‌కు మోడీ మరో షాక్?

సెప్టెంబర్ 26వ తేదీన ప్రధాని మోదీ ప్రసంగం ఉంటుందని ఆ జాబితాలో ఉంది. అదే రోజున ఇజ్రాయిల్, చైనా, పాకిస్థాన్, బంగ్లాదేశ్ నేతలు కూడా ప్రసంగిస్తారు. ఈ సమావేశాలకు ప్రధాని యూఎస్ వెళ్తారని అంతా భావించారు. ఈ పర్యటన సందర్భంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఇరుదేశాల మధ్య నెలకొన్న వాణిజ్య సమస్యల పరిష్కారానికి ట్రంప్-మోదీ భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నాయి. అయితే, అనూహ్యంగా ఈ సమావేశాలకు మోదీ దూరంగా ఉన్నట్లు- తెలిసింది. దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

### విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలి

**- సిరిసిల్ల జేఎన్టీయూలో శాశ్వత భవనాలు నిర్మించాలి**

**- సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, వీసీతో ఫోన్‌లో సంప్రదించిన కేటీఆర్**




**హైదరాబాద్ - - ప్రజా స్వేచ్ఛ**

జేఎన్టీయూ సిరిసిల్లలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ విషయంపై సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, జేఎన్టీయూ వీసీ టి కిషన్‌కుమార్‌రెడ్డితో ఆయన ఫోన్‌లో సంప్రదించారు. జేఎన్టీయూ సిరిసిల్లలో ఇంజినీరింగ్ కాలేజీ కోసం శాశ్వత భవనాల నిర్మాణం పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తరగతులకు ఆటంకం కలగకుండా చూస్తామని అధికారులు హామీ ఇచ్చారని తెలిపారు. సిరిసిల్లలోని జేఎన్టీయూ ఇంజినీరింగ్ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. తమ హయాంలో ప్రారంభించిన జేఎన్టీయూ సిరిసిల్ల ఇంజినీరింగ్ కాలేజీకి అవసరమైన శాశ్వత భవనాల నిర్మాణం చేపట్టే దిశగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వేములవాడలోని డిగ్రీ కాలేజీలో కొనసాగుతున్న ప్రస్తుత తాత్కాలిక తరగతి గదులకు తాళం వేయడంతో ఇంజినీరింగ్ విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై పత్రికల్లో వచ్చిన వార్తను ఆయన సీరియస్‌గా తీసుకున్నారు. ప్రస్తుతం నడుస్తున్న తీరుగానే స్థానిక అగ్రహారంలోని డిగ్రీ కాలేజీ అధికారులకు తగిన ఆదేశాలు ఇచ్చి జేఎన్టీయూ ఇంజినీరింగ్ కాలేజీ కార్యకలాపాలు నిరాటంకంగా కొనసాగేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వెంటనే కాలేజీతో అవసరమైన ఒప్పందం చేసుకుని పెండింగ్‌లో ఉన్న అద్దె బకాయిలను చెల్లించేలా చూడాలని కోరారు. ఈ అంశంలో సానుకూలంగా స్పందించిన సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ వెంటనే పెండింగ్ బకాయిలను చెల్లించడంతోపాటు తరగతులకు ఎలాంటి అంతరాయం లేకుండా విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా చూస్తామని హామీ ఇచ్చారని వివరించారు.

# బై బై గణేశా..

(మొదటి తరువాయి)



ఈ శోభాయాత్రలో పాలుపంచుకోవడానికి నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. దారి పొడవునా భక్తులు పసుపు, కుంకుమలతో గణపతికి నీరాజనం పలికి, తమ భక్తిని చాటుకున్నారు. ఎక్కడ చూసినా పూలతో అలంకరించిన వాహనాలు, డప్పుల చప్పుడు, నృత్యాలతో నగర వీధులు పండుగ వాతావరణాన్ని తలపించాయి. మధ్యాహ్నం 12 గంటలకు భారీ శోభాయాత్ర ట్యాంక్‌బండ్‌లోని ఎన్టీఆర్ మార్గ్‌కు చేరుకుంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ మళ్లింపులతో పాటు, భారీ క్రేన్ల వద్ద ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగింది. గణనాథుడి ఊరేగింపు ట్యాంక్‌బండ్‌కు చేరుకోగానే అక్కడ పూజల కోసం వేచి ఉన్న భక్తులు "జై గణేశా.. జై జై గణేశా" అంటూ నినాదాలు చేశారు.

**ప్రత్యేక పూజల అనంతరం నిమజ్జనం**

ఎన్టీఆర్ మార్గ్‌లోని నాలుగవ క్రేన్ వద్దకు చేరుకున్న లంబోధరుడికి ఖైరతాబాద్ ఉత్సవ సమితి సభ్యులు, ప్రముఖులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో భాగంగా గణనాథుడికి చివరిసారిగా హారతి ఇచ్చి, పుష్పాలతో అలంకరించారు. అనంతరం భారీ క్రేన్ సహాయంతో సుమారు 70 టన్నుల బరువున్న గణపతిని నిదానంగా హుస్సేన్ సాగర్ నదిలోకి నిమజ్జనం చేశారు. మహా గణపతి నీటిలో మునిగిపోతుండగా భక్తుల జై గణేశా నినాదాలు మిన్నంటాయి. ఈ శోభాయాత్రలో పాల్గొనడానికి రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచే కాకుండా, పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. ఒక నెల పాటు ఉత్సవాలు జరుపుకున్న ఖైరతాబాద్ గణనాథుడి దర్శనం కోసం ప్రతి ఏటా లక్షల మంది భక్తులు తరలివస్తారు. ఈ సంవత్సరం కూడా భారీగా భక్తులు తరలివచ్చి చివరిసారిగా తమ అభిమాన దైవాన్ని చూసి ఆశీర్వాదం పొందారు. పోలీసు యంత్రాంగం నిమజ్జనాన్ని విజయవంతం చేయడానికి అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంది. క్రేన్ల వద్ద భారీగా పోలీసు బలగాలను మోహరించి, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూశారు. అటు ఖైరతాబాద్‌లో, ఇటు ట్యాంక్‌బండ్‌లో నిమజ్జన ప్రక్రియను పూర్తి చేయడానికి వివిధ ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేశాయి. ఈ విజయవంతమైన నిమజ్జనంతో 11 రోజుల గణేశ్ ఉత్సవాలు ముగిశాయి.

## రాష్ట్రల ఆర్థికమంత్రులతో చర్చించాకే శ్లాబులు

జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో 5, 18 శాతం శ్లాబులకి తగ్గిస్తూ.. గతంలో ఉన్న 12, 28 శాతం శ్లాబులను తొలగిస్తూ ఈ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. ఈ శ్లాబులు సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి రానుంది. తాజాగా ఈ విషయంపై నిర్మలా సీతారామన్ పిటిఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'సామాన్యులపై దృష్టిసారించి సంస్కరణలు చేపట్టాము. సామాన్యుడు వినియోగించే వస్తువులపై విధించే పన్నుపై సమీక్షించాము. ఈ సంస్కరణల వల్ల రేట్లు- బాగా తగ్గనున్నాయి' అని ఆమె అన్నారు. ఇకపోతే జీఎస్టీ లో సంస్కరణలకు మద్దతు తెలిపినందుకు అన్ని రాష్ట్రాలకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి అన్ని రాష్ట్రాల ఆర్థిక మంత్రులకు లేఖ రాసినట్లు- చెప్పారు. పన్ను రేట్లను సవరించాలనే దానిపై రాష్ట్రాలు అభిప్రాయాలు చెప్పినప్పటికీ.. అవన్నీ సామాన్యుడికి ప్రయోజనం కలిగించేవేనని అన్నారు. జీఎస్టీ కౌన్సిల్‌లో తీసుకున్న నిర్ణయాలు దేశ ప్రజలకు ఎంతో దోహదపడతాయన్నారు. జీఎస్టీ రేట్లలో మార్పునకు మద్దతు తెలియ జేసినందుకు ప్రతి ఆర్థిక మంత్రికి ధన్యవాదాలు తెలియజేశా. ఎన్ని తీవ్రమైన చర్చలు, వాదనలైనా చేయవచ్చు. చివరకు జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయాలతో దేశ ప్రజలకు ఉపశమనం కలిగింది. ఇందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ లేఖ రాశానని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. సామాన్యులకు ప్రయోజనం చేకూర్చే సవరణలే ఉన్నాయని, వీటికి వ్యతిరేకంగా మాట్లాడే అవకాశమే లేదన్నారు. దేశ ప్రయోజనాల కోసం అందరూ ఒక్కతాటిపైకి రావడం సంతోషకర విషయమన్నారు.రేట్ల తగ్గింపుపై రాష్ట్రాలు ఎప్పుడూ అనుకూలంగానే ఉంటాయని, అయితే, వారి ఆందోళనంతా రాబడిలో కోతపైనే ఉంటుందని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. తాజా తగ్గింపుతో రాష్ట్రాలకే కాకుండా కేంద్రం కూడా ఆదాయం కోల్పోతుందన్న విషయం వారికి చెప్పాను. రేట్లు- తగ్గితే ప్రజలు కొనుగోలు చేస్తారు. తద్వారా కోల్పోయిన ఆదాయాన్ని ప్రభుత్వాలు భర్తీ చేసుకోవచ్చు. ఈ విషయంతోనే ఏకాభిప్రాయం కుదిరిందని కేంద్ర మంత్రి వివరించారు. ఇదిలాఉంటే, ఇటీవల తీసుకున్న జీఎస్‌టీ- కొత్త రేట్లు- సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి రానున్న విషయం తెలిసిందే.

## కమిషన్లు రావనే పేదలకు ఇళ్లు కట్టలేదు

(మొదటి తరువాయి)

ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే తూడి మెగారెడ్డి, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పులకు తమ ప్రభుత్వం నెల నెల వడ్డీలు కడుతూనే.. అభివృద్ధిని, సంక్షేమాన్ని జోడెడ్లలా ముందుకు తీసుకుపోతున్నామని ఉద్ఘాటించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని విమర్శించారు. పేదవారిని ఓటు-బ్యాంకుగా మాత్రమే చూశారని ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 7 లక్షల కొత్త రేషన్ కార్డులు ఇచ్చామని.. పాత రేషన్ కార్డుల్లో 17 లక్షల మంది పేర్లను చేర్చామని చెప్పుకొచ్చారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం సంవత్సరానికి రెండువేల డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇచ్చి ఉంటే అందరికీ ఇళ్లు వచ్చేవని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇళ్లు కడితే కమిషన్లు రావని తెలిసి మాజీ సీఎం కేసీఆర్ ఇళ్లను కట్టలేదని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు కడితే కమిషన్లు వస్తాయని తెలిసి ఆ ప్రాజెక్టును చేపట్టారని విమర్శించారు. కాళేశ్వరంలో కేసీఆర్ ప్రభుత్వం భారీగా అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. రాబోయే మూడు విడతల్లో ప్రతి గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టిచ్చి ఇస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు.

## కవిత ఓ కొరివి దయ్యం

(మొదటి తరువాయి)

సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి హాజరయ్యారు. ఈ నేపథ్యంలో.. మీడియాతో మాట్లాడిన మంత్రి జూపల్లి కృష్ణారావు మాజీ ఎమ్మెల్సీ కవితపై సంచలన వ్యాఖ్యలు చేశారు.

## రోప్ వే తెగి ఆరుగురి మృతి

**గుజరాత్‌లోని పావగఢ్ కొండపై విషాదం**



**న్యూఢిల్లీ - - ప్రజా స్వేచ్ఛ**

గుజరాత్‌లోని పంచమహల్ జిల్లా, పావగఢ్ కొండపై శనివారం కార్గో రోప్‌వే కేబుల్ తీగ తెగిపోవడంతో ఆరుగురు మరణించారు. ఈ కొండపై మహాకాళిక దేవాలయం ఉంది. పోలీసు సూపరింటెండెంట్ హరేష్ దుధట్ మాట్లాడుతూ, ఈ సంఘటనలో ఆరుగురు మరణించారని, పోలీసు, అగ్నిమాపక సిబ్బంది సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. పంచమహల్ కలెక్టర్ అజయ్ దహియా మాట్లాడుతూ మృతుల్లో ఇద్దరు లిఫ్ట్ ఆపరేటర్లు, ఇద్దరు కూలీలు ఉన్నారన్నారు. ప్రధాన రోప్ వేని రెండు రోజుల నుంచి మూసేసినట్లు తెలిపారు.

## 35లక్షలకు బాలాపూర్ గణేశ్ లడ్డూ


**ఏళకలుగా లడ్డూ కోసం యత్నిస్తున్న దశరథ గౌడ్**

**హైదరాబాద్, - - ప్రజా స్వేచ్ఛ**

తెలుగు రాల్లో ఎంతో ప్రతిష్ఠాత్మకమైన బాలాపూర్ లడ్డూ వేలం పాట ఘనంగా సాగింది. ఈ సారి లడ్డూ వేలంలో భారీ ధర పలికింది. దీన్ని కర్మన్‌ఘాట్‌కు చెందిన లింగాల దశరథ గౌడ్ అనే వ్యక్తి రూ.35 లక్షలకు దక్కించుకున్నారు. వేలంలో 38 మంది భక్తులు పాల్గొన్నారు. గతేడాది ఈ లడ్డూను రూ.30.01 లక్షలకు కొలను శంకర్‌రెడ్డి దక్కించుకున్నారు. గతేడాదికంటే ఈసారి లడ్డూ ధర రూ.4.99 లక్షలు అధికంగా పలికింది. లడ్డూ విజేత దశరథగౌడ్‌ను ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ- సన్మానించింది. 'బాలాపూర్ లడ్డూ అంటే నాకు చాలా ఇష్టం. ఆరేళ్లుగా దీని కోసం ప్రయత్నిస్తున్నా. ఇన్నేళ్ల తర్వాత బాలాపూర్ లడ్డూ దక్కింది. ఎంతో సంతోషంగా ఉందని దశరథగౌడ్ పేర్కొన్నారు. బాలాపూర్ గణేశుడి లడ్డూ కోసం ఆరేళ్లుగా ప్రయత్నిస్తున్నాని లడ్డూ విజేత లింగాల దశరథ గౌడ్ పేర్కొన్నారు. ఇన్నేళ్ల తర్వాత బాలాపూర్ గణేశుడి లడ్డూ దక్కడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. బాలాపూర్ గణేశ్ అంటే తనకు చాలా ఇష్టమని, గత కొన్నేండ్ల నుంచి ఇక్కడికి వస్తున్నట్లు- పేర్కొన్నారు. ఇవాళ ఆ భగవంతుడు నాకు లడ్డూను దక్కించాడు.. చాలా సంతోషంగా ఉందని లింగాల దశరథ గౌడ్ పేర్కొన్నారు. లడ్డూ విజేత దశరథ గౌడ్‌ను ఉత్సవ కమిటీ- సన్మానించింది. రూ. 35 లక్షల నగదును ఉత్సవ కమిటీకి దశరథ గౌడ్ అందించారు. రాష్ట్రంలో ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్న బాలాపూర్ గణేశుడి లడ్డూ మరోసారి భారీ ధర పలికింది. గత రికార్డులను బ్రేక్‌చేస్తూ వేలం పాటలో రూ.35 లక్షలకు కర్మాన్‌ఘాట్‌కు చెందిన లింగాల దశరథ గౌడ్ దక్కించుకున్న సంగతి తెలిసిందే. ఇది గతేడాదికంటే రూ. 4.99 లక్షలు అధికం. 2024లో బాలాపూర్ గణేశ్ ఉత్సవ సమితికి చెందిన కొలను శంకర్ రెడ్డి రూ.30.01 లక్షలకు దక్కించుకున్నారు. బాలాపూర్ గణేశుడి ఊరేగింపు తర్వాత గ్రామంలోని బొడ్రాయి వద్ద వేలం పాట నిర్వహించారు. ఇందులో మొత్తం 38 మంది పాల్గొన్నారు. వారిలో ఏడుగురు స్థానికేతరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి పాల్గొన్నారు. లడ్డూవేలం తిలకించేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు.

## సంపాదకీయం

# నిమజ్జనం



నవరాత్రులు ఉత్సవాలు జరిపాక గణనాయకునికి జనం నిమజ్జన కార్యక్రమాన్ని చేపట్టారు. గణానికి నాయకుడుగా పేరొందిన అతనికి మట్టితో ఒక రూపాన్నిచ్చి, పూజలు చేసి, ఆదుకొమ్మని, సకల సౌభాగ్యాలను అందివ్వమని, ఇడుముల తొలగించి, కుడుములు భుజించమని ప్రార్థించి, వేడుకుని, ప్రతిమను నీటిలో కలిపేస్తాము. ప్రజలకు కష్టాలు, కడగండ్లు, బాధలు, కన్నీళ్లు, దుఃఖాలు ఉన్నంతకాలం ఈ వేడుకోవడాలు కొనసాగుతూనే ఉంటాయి. వాటన్నింటినీ తీర్చేవాడున్నాడనే ఒక భరోసాయే విశ్వాసము. ఈ విశ్వాసములే పెరిగి పెరిగి మూఢ విశ్వాసాలుగా పరిణామం చెందుతాయి. అది వేరే విషయం. ఒక సమూహాన్ని ప్రాకృతికపరమైన సామాజికపరమైన ప్రమాదాల నుండి, ఇబ్బందుల నుండి రక్షిస్తూ, నాయకత్వం వహించే సమర్థుడు గణనాయకునిగా రూపాంతరం చెందాడనేది చారిత్రక పరిణామాన్ని గమనిస్తే అర్థమవుతుంది. వాస్తవిక సామాజిక పరిణామాలలోంచే పురాణాలు, ఇతిహాసాలు పురుడుపోసుకుంటాయి. వాటికి కొన్ని కల్పనలను, ఊహలను, ఆధ్యాత్మికతను జోడించి ప్రచారమవుతాయి. మన నాయకుడైతే, మనిషి శరీరానికి ఏనుగుతల అతికించడాన్ని ప్లాస్టిక్ సర్జరీ నైపుణ్యంగా పోల్చి, ఆనాడే మనకా విజ్ఞానం ఉందని పురాణకథకు సైన్సును ఆపాదించారు. ఇక సైన్సు, టెక్నాలజీ చదువుల కన్నా, జ్యోతిష్యం, వాస్తు, తాంత్రికవిద్యలను చదవాలని ప్రయత్నం మొదలేసారు. దీన్నే మూఢత్వం అంటారు. అందుకనే శాస్త్ర విజ్ఞాన పరిశోధనలలో మనం వెనుకబడి ఉన్నాం. సనాతనం పేరుతో వెనకకు మళ్ళుతున్నాం.

అదలా ఉంచితే భక్తి శ్రద్ధలతో జరగాల్సిన ఉత్సవాలు, వాటికి భిన్నమైన రీతిలోకి భక్తిని తీసుకుని వచ్చారు. మతతత్వాన్ని రెచ్చగొట్టే విపరీత కార్యక్రమాలుగా మార్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇక నిమజ్జన ఊరేగింపులలో మద్యం పొంగి పొర్లుతోంది. మత్తునిండిన మనుషుల డీజే నృత్యపు గెంతులతో భక్తిరసం వెర్రెక్కిపారుతోంది.

అనేకానేక పోలీసు విభాగాల నిఘాలతో నేరాలను, అసాంఘీక శక్తులను కట్టడి చేయాల్సిన అవసరం ఏర్పడుతోందంటే, ఇది ఎలా పరిణామం చెందిందో అర్థం చేసుకోవచ్చు. ఇక పర్యావరణాన్ని కాపాడుకునే మట్టి వినాయకులనే పెట్టాలని విజ్ఞప్తులు చేసినా వినే పరిస్థితులు లేవు. పర్యావరణం, సామాజికావరణం కాలుష్యమయ్యే ఏ చర్యలనయినా మనం నియంత్రించుకోవలసిందే! ప్రజలు ఈ విషయాలపట్ల అప్రమత్తంగా ఉండాలి. భక్తితో వేడుకున్న జనం, మృత్తిక రూపాన్ని నిమజ్జనం చేసిన తీరుగానే, ప్రజల బాధలను, ఇక్కట్లను తొలగించని నాయకులనూ, ఐక్యతను, శాంతిని, సౌభ్రాతృత్వాన్ని భగపరచే పాలకులను నిమజ్జనం చేయటమూ అవసరమే! నిమజ్జనమంటే ఇక్కడ తొలగించడమనే అర్థం. సమాజగతిలో మనకెన్నో మంచి సంప్రదాయాలుఒనగూరి ఉంటాయి. వాటితోపాటే చెడూ చేరుతుంది. మంచిని, ప్రయోజనకరమైనవి గ్రహించుకుని, చెడును తొలగించుకోవాలి. ఇపుడు జరుగుతున్నది దీనికి విరుద్ధమైనది. చెడును గ్రహించి, మంచిని వదిలేస్తున్నాం. నిజంగా ఇపుడు వొదిలించుకోవాల్సింది ఏమిటీ అంటే.. ముఖ్యంగా విద్వేషాన్ని నిమజ్జనం చేసి వొదిలించుకోవాలి. లేకుంటే ఇది మనుషుల్ని అమానవీయంగా తయారుచేస్తుంది. విభజిస్తుంది. ఉన్మత్తులుగా మారుస్తుంది. అందుకే తీసేయాలి. అనేక జాఢ్యాలు మనల్ని పట్టిపీడిస్తున్నాయి. నేడు పెచ్చరిల్లుతున్న కులమత విభేదాలను, వివక్షతలను వదిలేయాలి. అజ్ఞానము, అంధ విశ్వాసాలు మన అభివృద్ధికి పెద్ద ఆటంకాలు. వాటిని వొదిలించుకోవాలి. శాస్త్ర విజ్ఞానాలవైపు అడుగులుపడాలి. నేటి యువతను పెడదారి పట్టిస్తున్న ప్రమాదకరమైన డ్రగ్స్ అలవాటును నిమజ్జనం చేయాలి. ఆ మత్తు మాఫియాను లేకుండా చేయాలి. తన బాగు కోసం ఇతరులను మోసం చేయడానికి, దోపిడీ చేయటానికి కూడా వెనుకాడనితనాన్ని నిమజ్జనం చేయాలి. దుష్టత్వాలను, దురాలోచనలను, చెడువర్తనలను, కుటిలత్వాలను, మరెన్నింటినో మనం వొదిలించుకోవాల్సి ఉంది. ఈ రోజున గణపతి ప్రతిమను నిమజ్జనం చేస్తున్న సందర్భంలో, నీటిలో ముంచి వొదిలివేస్తున్న వేళ, ఇంకా ఏవేవి ఎలా వొదిలించుకోవాలో ఒకసారి ఆలోచించుకోవాలి. పండుగలు, ఉత్సవాలు, జాతరలు, అనాదిగా ప్రజలు జరుపుకునే సమూహపు సందళ్ళు. వాటి నెవరూ తప్పుపట్టరు. కానీ వాటిలోకి సాంస్కృతిక కాలుష్యాలు చేరకుండా జాగ్రత్తపడాలి.

## నేడు జాతీయ ప్రజాస్వామిక లౌకిక కూటమి (NDSF) అత్యంత కీలక సమావేశం

### తెలంగాణ ఉపఎన్నికలపై వ్యూహరచన

**ఈ సమావేశానికి తెలంగాణ రైతు రాజ్యం సమితి రాష్ట్ర అధ్యక్షులు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి , తరిగొప్పుల అమరేందర్ తెలంగాణ హైకోర్టు న్యాయవాది తో పాటు ప్రతినిధులు అందరూ అటెండ్ అవుతున్నారు.**








హైదరాబాద్, – ప్రజా స్వేచ్ఛ
జాతీయ ప్రజాస్వామిక లౌకిక కూటమి (NDSF ) స్టీరింగ్ కమిటీ సమావేశం సెప్టెంబర్ 7 వ తేదీన (ఆదివారం) మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్ హిమాయత్ నగర్ లోని ఫ్రంట్ కార్యాలయం లో సమావేశం జరుగుతుందని ఫ్రంట్ జాతీయ చైర్మన్: దళిత బహుజన పార్టీ ( DBP) జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్ తెలిపారు. నేడు స్థానిక మీడియా మిత్రులకు ఒక ప్రెస్ నోట్ విడుదల చేసారు. తెలంగాణ లో త్వరలో జరిగే 11 అసెంబ్లీ నియోజకవర్గం స్థానాలకు ఉప – ఎన్నికల్లో మరియు రాష్ట్రవ్యాప్తంగా జరిగే స్థానిక సంస్థలకు జరిగే ఎన్నికల్లో ఫ్రంట్ తరుపున పోటీచేయడానికి.. రాజకీయ బౌషత్ ను కార్యాచరణ ను రూపొందించికోవడానికి ఈ సమావేశం ను నిర్వహిస్తున్నామని తెలిపారు NDSF లో భాగస్వామ్యం సంస్థలు గా దళిత బహుజన పార్టీ ( DBP) రిపబ్లికన్ పార్టీ అఫ్ ఇండియా ( RPI) వంచిత్ బహుజన్ అఘాడి (VBA) ఇండియన్ లేబర్ పార్టీ. భారత్ ప్రజా లేబర్ పార్టీ. ఇండియన్ లోక్ దళ్. లోక్ జన శక్తి. జనతా దళ్. లోక్ తాంత్రిక జనతా పార్టీ..శివసేన ( బాల్థాకరే వర్గం ) సిపిఐ ( ఎంఎల్). BSP (అంబేద్కర్. పూలే). ఇండియన్ ముస్లిం లీగ్ పార్టీ ( IML ) మాలమహానాడు MRPS. IHRC.ఆల్ ఇండియా బీసీ హక్కుల రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ (AI BRPC). ముస్లిం రైట్స్ ఫోరమ్.. తెలంగాణ నేతకాని మహర్ కుల సంఘము. తెలంగాణ బేగర సంక్షేమ సంఘము.తదితర రాజకీయ. కుల ప్రజా సంఘాల సంస్థలు భాగస్వామ్యం గా ఉన్నారని తెలిపారు.ఈ ఫ్రంట్ సమావేశానికి **ఈ సమావేశానికి తెలంగాణ రైతు రాజ్యం సమితి రాష్ట్ర అధ్యక్షులు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి , తరిగొప్పుల అమరేందర్ తెలంగాణ హైకోర్టు న్యాయవాది తో పాటు** ప్రతినిధులు అందరూ అటెండ్ అవుతున్నారని తెలిపారు. బిజెపి కాంగ్రెస్ . బి. ఆర్. ఎస్ లకు రాజకీయ ప్రత్యామ్నాయం గా NDSF నిలబడుతుందని ఫ్రంట్ చైర్మన్ వడ్లమూరి కృష్ణ స్వరూప్ తెలిపారు..

## భవనం కుప్పకూలి ఇద్దరు మృతి

**–శిథిలాల కింద పలువురు..!**

**–రాజస్తాన్‌లో ఘటన**



**జైపూర్ – ప్రజా స్వేచ్ఛ**
పురాతన భవనం కుప్పకూలిన ఘటనలో ఇద్దరు మృతిచెందారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారు ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రాజస్థాన్ రాజధాని జైపూర్‌లోని సుభాష్ చౌక్ ఏరియాలో శనివారం తెల్లవారుజామున 1.30 గంటలకు ఈ ఘటన చోటుచేసుకుంది. సమాచారం అందిన వెంటనే పోలీసులు, స్థానిక అధికారులు రెస్క్యూ టీమ్స్‌తో సహా ఘటనా ప్రాంతానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మొత్తం ఏడుగురు క్షతగాత్రులను వెలికితీసి ఆస్పత్రికి తరలించారు. వారిలో ఇద్దరు చికిత్స పొందుతూ మృతిచెందారు. కూలిపోయిన భవనంలో మొత్తం 19 మంది అద్దెకు ఉంటున్నారని స్థానికులు తెలిపారు. భవనం కూలినప్పుడు అందరూ అందులోనే ఉన్నారా..? ఎవరైనా బయట ఉన్నారా..? అనే వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు చెప్పారు. శిథిలాల కింద పలువురు చిక్కుకుని ఉంటారని అనుమానిస్తున్నట్టు తెలిపారు. వారి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయని అన్నారు.

## అమెరికాతో భాగస్వామ్యానికి మోడీ ప్రాముఖ్యత: జైశంకర్




**న్యూఢిల్లీ – – ప్రజా స్వేచ్ఛ**
ట్రంప్ టారిఫ్‌ల నేపథ్యంలో భారత్– అమెరికా సంబంధాలు దెబ్బతిన్న తరుణంలో భారత విదేశాంగ వ్యవహారాల మంత్రి జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో ఇరుదేశాల సంబంధాలపై భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ మాట్లాడారు. అమెరికాతో భాగస్వామ్యానికి మోడీ అధిక ప్రాధాన్యత ఇస్తారని వ్యాఖ్యానించారు. ట్రంప్‌తో కూడా ఆయనకు బలమైన వ్యక్తిగత సంబంధాలు ఉన్నాయన్నారు. అగ్రరాజ్యంతో భారత అధికారుల సంప్రదింపులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందనే కారణంతో భారత్‌పై ట్రంప్ భారీగా సుంకాలు విధించారు. చైనా, రష్యా, భారత్‌లు దగ్గరైన నేపథ్యంలో ఆయన స్వరం మారుస్తూ.. మోడీ గొప్ప ప్రధాని అంటూ ప్రశంసలు కురిపించారు. భారత్– అమెరికాలది ప్రత్యేక బంధమని, దీనిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు. ట్రంప్ వ్యాఖ్యలపై మోడీ ఎక్స్ వేదికగా స్పందించారు. ఇరుదేశాల సంబంధాలపై ట్రంప్ భావాలు, సానుకూల దృక్పథాన్ని అభినందించారు. భారత్, అమెరికా మంచి భవిష్యత్తు, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నాయన్నారు.

## జాతీయ విపత్తుగా ఉత్తరాది వరదలు

**కేంద్రానికి సిపిఎం పొలిట్‌బ్యూరో వినతి**

**యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలకు డిమాండ్**

**న్యూఢిల్లీ – ప్రజా స్వేచ్ఛ**
ఉత్తర భారతంలో వరదలు, కొండచరియలు కూలిపడడం వంటి అసాధారణ పరిస్థితులు నెలకొనడంపై సిపిఎం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ విలయాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించి యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని, బాధిత రాష్ట్రాలను ఆదుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు సిపిఎం పొలిట్‌బ్యూరో శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. పంజాబ్, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్మూ కాశ్మీర్, రాజస్థాన్, ఢిల్లీల్లో భారీ వర్షాలు, వరదలు, కొండచరియలు కూలడం వంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. కనివినీ ఎరుగనిరీతిలో చోటు చేసుకున్న ఈ ప్రకృతి వైపరీత్యంలో జరిగిన ప్రాణనష్టంపై సిపిఎం విచారం వెలిబుచ్చింది. పంజాబ్ ఈ వరదలకు బాగా దెబ్బతింది. రాష్ట్రంలోని 23 జిల్లాలు వరద తాకిడికి గురయ్యాయి. రాష్ట్రంలోని 1655



గ్రామాల్లో దాదాపు మూడు లక్షల ఎకరాల్లో చేతికి వచ్చిన పంట పూర్తిగానో లేదా పాక్షికంగానే మునిగిపోయింది. నాలుగు లక్షల మందికి పైగా ప్రజలు వరదల బాధితులని వార్తలు పేర్కొంటున్నాయి. ఒకవైపు భారీ వర్షాలు, మరోవైపు అనేక డ్యామ్‌ల నుండి మిగులు నీటిని విడుదల చేయడంతో బియాస్, సట్లెజ్, రావి, ఘగ్గర్ వంటి నదులు పొంగిపొర్లుతున్నాయి. ఫలితంగా పంజాబ్, హర్యానాలో పంటలకు తీవ్రంగా నష్టం వాటిల్లింది.

# సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన కమాండింగ్-ఇన్-చీఫ్, లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

హైదరాబాద్: ప్రజా స్వేచ్ఛ
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని పూణె సదరన్ కమాండ్ కమాండింగ్-ఇన్-చీఫ్, జనరల్ ఆఫీసర్ లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్ మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన ఈ భేటీలో ధీరజ్ సేథ్‌తో పాటు దక్షిణ భారత్ ఏరియా జీఓసీ మేజర్ జనరల్ ఆర్.ఎన్. శ్రీనివాస్, జీఓసీ టీజీ, ఏపీ మేజర్ జనరల్ అజయ్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు. సైనిక వ్యవహారాలు, రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం వంటి అంశాలపై ఈ బృందం ముఖ్యమంత్రితో చర్చించినట్లు సమాచారం. ఈ మర్యాదపూర్వక భేటీలో ఇరు వర్గాల మధ్య సత్సం బంధాలను కొనసాగించడంపై దృష్టి సారించారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఈ భేటీకి సంబంధించిన వివరాలు ఇంకా పూర్తిగా వెలువడనప్పటికీ, ఇది సాధారణ ప్రొటోకాల్ సమావేశంగా భావిస్తున్నారు. సైనిక అధికారుల ఈ భేటీ రాష్ట్ర భద్రత, సహకారం వంటి అంశాల్లో భవిష్యత్తులో సమన్వయాన్ని మరింత మెరుగుపరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# కాంగ్రెస్ పార్టీ లో చేరిన నాగపూర్ గ్రామ బిఆర్ఎస్ నాయకులు



గోపాల్ పేట్ ,ప్రజా స్వేచ్ఛ
ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ చేస్తున్న పనులకు సంక్షేమ పథకాలకు ఆకర్షించి రేవల్లి మండలంలోని నాగపూర్ గ్రామానికి చెందిన 15 మంది బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రేవల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వాడల పర్వతాలు, ఉమ్మడి గోపాల్ పేట్ మండల ఇంచార్జ్ సత్యశీలారెడ్డి ఆధ్వర్యంలో వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు వీరికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పది ఏళ్ల బిఆర్ఎస్ పాలనలో దుర్భర పరిస్థితులు ఎదుర్కొన్నామని నేడు ఇందిరమ్మ రాజ్యంలో అందరితో కలిసి పనిచేయాలని ఇష్టంతో కాంగ్రెస్ పార్టీ లో చేరినట్లు వారు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు వేణు, చెన్నకేశవులు, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# మరో 20 సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుంది

## -వనపర్తిని టాప్ 10లో నిలబెడుదాం

హైదరాబాద్ /ప్రజా స్వేచ్ఛ
మరో 20 సంవత్సరాలు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలో ఉంటుందని గ్రామాల్లో, మండలాల్లో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, అభిమానులు ప్రతి ఒక్కరు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రతి ఒక్కరికి చేర్చేందుకు కృషి చేయాలని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అన్నారు శనివారం పెద్దమందడి మండలం మంగంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల నాయకుల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం పాత, కొత్త అనే తేడా లేకుండా అందరూ ఒకే నినాదంతో జై కాంగ్రెస్ అంటూ పనిచేయాలని ఆయన సూచించారు రానున్న రోజుల్లో వనపర్తి నియోజకవర్గం విద్యాపరంగా వైద్యం పరంగా వ్యవసాయపరంగా పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందబోతోందని ఆయన అన్నారు వనపర్తి నియోజకవర్గానికి 6 కొత్త సింగిల్ విండోలు, 2 కొత్త వ్యవసాయ మార్కెట్ యార్డులు, రాబోతున్నాయని ఈ సందర్భంగా ఇంకొంచమందికి



రాజకీయపరమైన పదవులు వస్తాయని ఎమ్మెల్యే తెలిపారు విద్యాపరంగా త్వరలోనే వనపర్తికి కేంద్రీయ విద్యాలయం, నవోదయ, వెటర్నరీ కళాశాల, అనుసంధానంగా ఏడు వెటర్నరీ ఆసుపత్రులు, స్పోర్ట్స్ స్కూల్, టర్ఫ్ హాకీ మైదానం, స్విమ్మింగ్ పూల్, అనుసంధానంగా జిమ్ము, పాలిటెక్నిక్ కళాశాల పునరుద్ధరణ, హాం ప్రాజెక్టు ద్వారా రహదారుల బలోపేతం, చేయబోతున్నామని ఎమ్మెల్యే వివరించారు.కాంగ్రెస్ ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు వనపర్తి నియోజకవర్గంలో 1759 ఓట్ల రూపాయల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టమని ఎమ్మెల్యే తెలిపారు గత పదేళ్ల పాలనలో కేవలం జీవోలకే పరిమితమయ్యారు కానీ నిధులు మంజూరు చేయలేదన్నారు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి ఒక్కరిని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులనే గెలిపించాలని సూచించారు వనపర్తి నియోజకవర్గ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని, తాను ఎక్కడ మాట తప్పే ప్రసక్తే ఉండదని ఎమ్మెల్యే అన్నారు నేటి నుంచి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలందరూ ఓ సోషల్ మీడియా వారియర్ గా పని చేయాలని మనం చేసే చిన్న పనినైన ప్రజలకు తెలిసేలా చూడాల్సిన బాధ్యత మన అందరి పైన ఉందని ఎమ్మెల్యే సూచించారు

కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, పెబ్బేరు మార్కెట్ యార్డ్ అధ్యక్షులు ప్రమోదిని రెడ్డి, పీసీసీ సభ్యులు శంకర ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్రీలత రెడ్డి, మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షులు రామకృష్ణారెడ్డి, విజయవర్ధన్ రెడ్డి, ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, గ్రామ అధ్యక్షులు, మాజీ జెడ్పిటిసిలు, మాజీ ఎంపీపీలు మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# ఘనంగా ఉపాధ్యాయులకు సన్మానం




గోపాల్ పేట్ ,ప్రజా స్వేచ్ఛ...
మండల పరిధిలోని ఏదుట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం పాఠశాల విద్యార్థిని విద్యార్థులు తమకు విద్య బుద్ధులు నేర్పిస్తున్న గురువులను శాలువా పూలమాలతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణాచారి తో పాటు పాఠశాల ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేణాచారి మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టి ఉపాధ్యాయుల పట్ల భక్తిశ్రద్ధలతో మెలగాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మధుసూదన్ రావు, నరేంద్రాచారి, శ్రీనివాసులు, నాగరాజు, కృష్ణయ్య, రాధా, లక్ష్మి, దర్శన్ కుమార్, రాజవర్ధన్ రెడ్డి, లతీఫ్, బుచ్చారెడ్డి, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వం తోనే సాధ్యం!

- -ఏ గ్రామాన చూసినా ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణం
- -గత ప్రభుత్వంలో అమలు కాని ప్రభుత్వ ఉద్యోగాల కల్పన
- -కాంగ్రెస్ పాలనలో రేషన్ కార్డులు, రైతు భరోసా
- -మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం
- -వంట గ్యాస్ సబ్సిడీ, సన్నయబియ్యం పంపిణీ
- -నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరీ
- -అభివృద్ధి జరగాలంటే ఒక్క కాంగ్రెస్ పార్టీ వల్లే సాధ్యం
- -చేవెళ్ళ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డ మీది పెంటయ్య గౌడ్

చేవెళ్ళ ప్రజా స్వేచ్ఛ
ప్రజా సంక్షేమం ఒక్క కాంగ్రెస్ ప్రభుత్వం తోనే సాధ్యంమని చేవెళ్ళ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ గడ్డమీది పెంటయ్య గౌడ్ స్పష్టం చేశారు. ఆయన సామాజిక తెలంగాణ ప్రతినిధితో మాట్లాడుతూ పదేళ్ల అధికారంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందే ఏమీ లేదని ఎద్దేవా చేశారు. ఒక్క రేషన్ కార్డు ఇచ్చిన పాపాన పోలేదని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగాల కల్పన పై అసలు చిత్త శుద్ధి లేకపోయిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రభుత్వం ఉద్యోగాల నియామకం ఓ పండగలా చేపట్టిందని అన్నారు. రేషన్ కార్డులు మంజూరి చేసి సన్న బియ్యం పంపిణీ కి శ్రీకారం చుట్టిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపారు. ప్రతి కార్యక్రమాన్ని ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రణాళికా బద్దంగా చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు. మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని పేర్కొన్నారు. గురుకుల పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలను కల్పించిందని అన్నారు. కాంగ్రెస్ పాలనలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలే ఎక్కడ చూసినా కనిపిస్తాయని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. రోడ్లు లేని గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు సౌకర్యం కల్పిస్తూ



మరింత అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతుందని అన్నారు. ఇంకా ముందు ముందు అనేక ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తుందని చెప్పారు. ప్రతి గ్రామంలో ఇళ్ళు లేని నిరుపేదల కోసం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి పూర్తి నిర్మాణం జరిగేలా ప్రభుత్వం చేపడుతున్న ఒక్కో సంక్షేమ పథకం పట్ల ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని తెలియజేశారు. రైతుల కోసం రైతు భరోసా కార్యక్రమాన్ని చేపట్టి రైతుల్లో ఆనందాన్ని నింపిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులు జేజేలు పలుకుతున్నారని ఆయన స్పష్టం చేశారు. గత పదేళ్ల పాలనలో అభివృద్ధికి నోచుకోక గ్రామీణ ప్రాంతాలు అనేక సమస్యలతో ఇబ్బంది పడ్డాయని పేర్కొన్నారు.

# మైక్రో బ్రూవరి ల ఏర్పాటును విరమించుకోవాలి

## ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మార్కపురి సూర్య డిమాండ్



గోదావరిఖని ,ప్రజా స్వేచ్ఛ
రామగుండం కార్పొరేషన్ ప్రాంతంలో మైక్రో బ్రూవరి ఏర్పాటు కోసం విడుదల చేసిన నోటిఫికేషన్ రద్దు చేసి మైక్రో బ్రూవరి ఏర్పాటు కార్యక్రమాన్ని విరమించుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మార్కపురి సూర్య డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో లేని శ్రద్ధ తెలంగాణ ప్రాంతంలో మద్యాన్ని ఏరులై పారించడానికి చిత్తశుద్ధి చూపించడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని అన్నారు.ఇప్పటికే రాష్ట్రంలో మద్యం మరియు మత్తు పదార్థాల వల్ల యువత చెడు మార్గాల వైపు పయనిస్తున్నారని ఇలాంటి పరిస్థితుల్లో రామగుండం కార్పొరేషన్ ప్రాంతంలో మైక్రో బ్రూవరి ఏర్పాటు కోసం ఎక్సైజ్ శాఖ ఏర్పాటు చేయడమంటే కార్పొరేషన్ ప్రాంతంలో మరింత మద్యం ఏరులై పారే ప్రమాదం ఉందని సూర్య ఆవేదన వ్యక్తం చేశారు. పారిశ్రామిక ప్రాంతమైన రామగుండం కార్పొరేషన్ లో ఇప్పటికే గల్లీకో వైన్ షాప్ ఏర్పాటు చేయడంతో పాటు వందల బెల్ట్ షాపులు ఇల్లీగల్ గా నడుస్తున్న ఏటువంటి చర్యలు తీసుకోకుండా అక్రమ సంపాదనే ధ్యేయంగా పనిచేస్తున్న ఎక్సైజ్ శాఖ మైక్రో బ్రూవరి విధానాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని సూర్య డిమాండ్ చేశారు. రామగుండం కార్పొరేషన్ ప్రాంతంలో మైక్రో బ్రూవరి ఏర్పాటు వెనక్కి తీసుకోకపోతే ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఎక్సైజ్ శాఖ అధికారులను హెచ్చరించారు.

# సొంతింటి కలకై అభిప్రాయ సేకరణ



**మందమర్రి ,ప్రజా స్వేచ్ఛ**
మందమర్రిలోఈ నెల జిఎం కార్యాలయం ఆవరణలో 11,12 తేదీలలో సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో సివిల్ డిపార్ట్మెంట్లో బ్రాంచ్ కార్యదర్శి అల్లి రాజేందర్, రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రి వద్ద బ్రాంచ్ అధ్యక్షుడు సాంబార్ వెంకటస్వామి సొంతింటి కలకై వినూత్నమైన పోరాటంలో పాల్గొనాలని కోరారు..వారు మాట్లాడుతూ సొంతిల్లు కావాలా క్వార్టర్ కావాలా చేపట్టనున్న అభిప్రాయ సేకరణ ఓటింగ్లో కార్మికులు సిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు.దసరా పండుగకు ఇంకా కేవలం 25రోజులే ఉన్న ఇప్పటివరకు యాజమాన్యం లాభాలు ప్రకటించకపోవడం గెలిచిన సంఘాలు అసమర్థతని, ఓడిన సంఘాల వినతి పత్రాలు ఇచ్చుకుంటూ కాలం గడుపుతుండడం సరైనది కాదని వెంటనే లాభాలు ప్రకటించి వాటా చెల్లించాలని, కోల్ ఇండియా తరహాలో యూనిఫామ్ నాణ్యమైన యూనిఫామ్ క్లాత్ కు 12500ల రూపాయలు ఇవ్వాలన్నారు, మారుపేరుల సవరణ, అలవెన్స్ లపై ఐటీ మాఫీ, ప్రమోషన్ పాలసీని మార్చడం,యాక్టింగ్ ప్రమోషన్లను భర్తీ చేయాలని,తో పాటు ఇతర దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని మరియు కాంట్రాక్టు కార్మికులకు గత సంవత్సరం కన్నా పెంచి ఇవ్వాలని కోరుతూ నేల 15న అన్ని జిఎం ఆశ్రమం ధర్నాలు పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని వారు కార్మికులను కోరారు. రియాజ్ అహ్మద్ లాంటి నాయకులు ఉన్న చోట నుండి కదలకుండా సోషల్ మీడియాలో వీడియోలు పెడుతూ దుష్ప్రచారాలు మానుకోవాలని సొంతింటి కలకై పోరాటం చేస్తుంటే రంభ కావాలా...ఊర్వశి కావాలా...అంటూ హేళనగా మాట్లాడే పద్ధతి మీ సభ్యతకే వదిలేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ డిపార్ట్మెంట్ అధ్యక్షులు బోనాల మహేందర్, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ బాసపోయిన కుమారస్వామి. రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రి పిట్ సెక్రటరీ పసునుటి శ్రీకాంత్. సీనియర్ నాయకులు అలవాల సంజీవ్. తదితరులు పాల్గొన్నారు.

## క్రాంతి యూత్ ఆధ్వర్యంలో మహా అన్న ప్రసాద వితరణ



**నాగార్జునసాగర్ ,ప్రజా స్వేచ్ఛ**
క్రాంతి యువజన సేవా సంఘం 23వ గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం మహా అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. నందికొండ మున్సిపాలిటీ నాగార్జునసాగర్ హిల్ కాలనీ కాన్వెంట్ లైన్ లో ఏర్పాటుచేసిన 23వ గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సాగర్ సి.ఐ శ్రీను నాయక్ హాజరై అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి వేల సంఖ్యలో భక్తులుహాజరైనారు.ఈ కార్యక్రమంలో క్రాంతి యువజన సేవా సంఘం అధ్యక్షులు శివ ఉపాధ్యక్షులు నిమ్స్ శివ, కోశాధికారి వెంకట్, సత్యనారాయణ, సాయి, నిఖిల్, వార్డెన్ సాయి, శివ నాగులు, భరద్వాజ్, సైదులు, హేమంత్, పవన్, జీవన్, శీను మహిళా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం



**గోపాల్ పేట్ ,ప్రజా స్వేచ్ఛ**
ఏదుల మండల కేంద్రానికి చెందిన కోడిగంటి రంజిత్ కుమార్ కూతురు చిన్నారి విహానా మైట్రో కాండ్రియల్ వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్ కూకట్ పల్లి అంకుర హాస్పిటల్ లో వెంటిలేటర్ సహాయంతో చికిత్స పొందుతుంది. శ్వాసకు సంబంధించిన ఆపరేషన్ చేయాలని డాక్టర్లు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన రాము యాదవ్ శనివారం ఆసుపత్రి కి వెళ్లి చిన్నారి తల్లిదండ్రులను పరామర్శించి చిన్నారి వైద్య ఖర్చులకోసం తన వంతుగా పదివేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. చిన్నారి విహాన వైద్యం కోసం తల్లిదండ్రులు చాలా డబ్బులు ఖర్చు చేశారు ఆపరేషన్ కోసం దాతలు ఆర్థిక సహాయం చేయాలని తల్లితండ్రులు కోరుతున్నారు.

## రానున్న ఎన్నికలలో బీఎస్పీ సిద్ధం



**సిద్దిపేట ,ప్రజా స్వేచ్ఛ**
బీఎస్పీ సెంట్రల్ స్టేట్ కోఆర్డినేట్ బాలయ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ బహుజన సమాజ్ పార్టీ సిద్దిపేట జిల్లా కమిటీ సమీక్ష సమావేశం ఈరోజు ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి సిద్దిపేట పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించి అక్కడి నుండి ప్రెస్ క్లబ్ వరకు ర్యాలీగా పార్టీ నాయకులు విచ్చేసి ప్రెస్ క్లబ్ లో ఏర్పడిన సమావేశంలో సెంట్రల్ స్టేట్ కోఆర్డినేటర్ బాలయ్య మరియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.ఈశ్వర్ మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎలక్షన్లు బహుజన్ సమాజ్ పార్టీ సత్తా చాటుతుందని వారు తెలిపారు. దేశంలో ఎస్సీ ఎస్టీ బీసిల మీద దాడులు జరుగుతున్నాయని వారు తెలిపారు. బహుజనులకు రాజ్యాధికారం బీఎస్పీ ద్వారా మాత్రమే సాధ్యమని ఈ సందర్భంగా వారు తెలిపారు. సిద్దిపేట జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల పార్టీ సిద్ధమైందని రానున్న ఎన్నికలలో బీఎస్పీ సత్తా చాటుతుందని ఈ సందర్భంగా వారు తెలిపారు. మహాత్మ పూలే,అంబేద్కర్, కాన్సిరాం సిద్ధాంతాన్ని తీసుకుపోయే ఏకైక పార్టీ బీఎస్పీ మాత్రమే అని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి లు తిరుపతి, వెంకటేష్ జిల్లా అధ్యక్షులు ఓం ప్రకాష్,జిల్లా కమిటీ నాయకులు నరేష్, రవీందర్ సిద్దిపేట అసెంబ్లీ కమిటీ నాయకులు పుల్లూరు ఉమేష్,పంగా బాబు, సంపత, కిరణ్,అజయ్, ప్రశాంత్ ప్రసాద్,బిక్షపతి, భారత్,కరుణాకర్,నాగరాజు,మహేష్ వేణు,మహేష్ బాలు,బాలకిషన్, గణేష్, అరవింద్,భాను ప్రకాష్,శంకర్,సంజీవ్,అజయ్, శేఖర్,మహేష్ గజ్వేల్ అసెంబ్లీ నాయకులు చంద్రం,ప్రసాద్,రవి,నరేష్ హుస్నాబాద్ నాయకులు రాజు,శంకర్,యాదగిరి, శ్రీనివాస్ మైల తిరుపతి ,దుబ్బాక నాయకులు రాజు,నర్సింలు స్థానిక బిఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

## "వైభవంగా వినాయకుడికి పూజలు వినాయకుడి నిమజ్జనం"




**తిమ్మాపూర్ మండలం, ప్రజా స్వేచ్ఛ**
రామకృష్ణకాలనీలో శృతిజ్ఞ అపార్ట్మెంట్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడు తొమ్మిది నవరాత్రులు ప్రతి రోజు నిత్య పూజలు,దూప,దీప, నైవేద్యాలను వినాయకుడికి సమర్పించారు. ప్రతిరోజు వినాయక మండపంలో భజనలు చేశారు.గణేశు నికి వైభవంగా ఆఖరి రోజు ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.గణేశునికి ఆట,పాటలతో డప్పు,చప్పుట్ల మధ్య వినాయకుడి శోభాయాత్ర ఘనంగా నిర్వహించడం జరిగింది.అనంతరం వినాయకుడిని స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు.ఈ నిమజ్జన కార్యక్రమంలో గణేష్ ఉత్సవకమిటీ సభ్యులు,స్థానిక కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే డా సంజయ్ ని మర్యాద పూర్వకంగా కలిసిన రాష్ట్ర క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ కౌన్సిల్ మెంబర్



**జగిత్యాల జిల్లా ,ప్రజా స్వేచ్ఛ**
జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ ఎడమ కాలు ఫ్రాక్చర్ కాగా జగిత్యాలలో వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పరామర్శించడం జరిగిందని తెలంగాణ రాష్ట్ర క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ కౌన్సిల్ మెంబర్ సంజయ్ రెడ్డి తెలిపారు.

## రూ.1,61,000 రూపాయలకు లడ్డు కైవసం చేసుకున్న లవకుశ రెడ్డి,



**శంషాబాద్ ,ప్రజా స్వేచ్ఛ**
శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శాతం రాయి మెయిన్ చౌరస్తా లో వినాయక చవితి ఉత్సవాల్లో గణనాథుని చేతిలోని నవరాత్రులు పూజలు అందుకున్న వినాయక లడ్డుని సొంతం చేసుకుంటే తమకు శుభం కలుగుతుందని అందుకోసమే వినాయక లడ్డుని పోటాపోటీగా పాల్గొని వేలం పాటలో లడ్డుని దక్కించుకున్నానని తోట లవకుశ రెడ్డి అన్నారు. శనివారం శాతం రాయి శ్రీ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయకుని లడ్డును 1,61,000 రూపాయలకు లవకుశ రెడ్డి, దక్కించుకున్నారు అనంతరం కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో పోతుగంటి దయానంద్, బద్రు నాయక్, జల్లపల్లి నరేందర్, సురేందర్, భవాని మల్లేష్, పోతుగంటి యాదయ్య, ఓరుగంటి జంగయ్య, యంజాల కిరణ్, మహేష్, శంకరయ్య, పోతుగంటి రాజు, రమేష్,వంకలి బాలరాజ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను కలిసిన మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ యాదయ్య.




**మహేశ్వరం, ప్రజా స్వేచ్ఛ**
మహేశ్వరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చాకలి యాదయ్య శనివారం టీపీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన టీపీసీసీ అధ్యక్షునిగా పదవీ బాధ్యతలు చేపట్టి ఒక సంవత్సర కాలం పూర్తి కావస్తున్న సందర్భంగా ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ప్రజా పాలనలో సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ లు తెలంగాణ ప్రజలకు సంక్షేమ పాలనను అందిస్తున్నారని ఆయన కొనియాడారు.

## ఇంజాపూర్ గణేష్ లడ్డు వేలం పాట



**మర్రిగూడ ప్రజా స్వేచ్ఛ**
మర్రిగూడ మండలం సరంపేట గ్రామ వాసి ఈ సంవత్సరం ఇంజపూర్ గణేష్ లడ్డు వేలంపాట వేయడం జరిగింది. ఈ యొక్క లడ్డు వేలంలో అనేకమంది పాట పాడడం జరిగింది అందులో ఇంజాపూర్ కాలనీ లో వేలంపాటలో ఆ యొక్క కాలనీ అధ్యక్షులు సాపల్లి పెద్ద సైదులు పాట పాడటం జరిగింది పాట 1,35,116 రూపాయలు పాడడం జరిగింది ఈ యొక్క పాటలో కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు కాలనీ అధ్యక్షులు సాపల్లి పెద్ద సైదులు మాట్లాడుతూ ఈ యొక్క లడ్డు వేలం పాడడం నా అదృష్టంగా భావిస్తున్నాను. అలాగే కాలనీవాసులు అందరూ గణేశుని దయవల్ల ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలని ఆ యొక్క గణపతిని వేడుకోవడం జరిగింది అని అన్నారు ఈ యొక్క సమావేశంలో కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పటాన్చెరు గోనెమ్మ బస్తీలో అంబరానంటిన గణేష్ సంబరాలు




**పటాన్చెరు ,ప్రజా స్వేచ్ఛ**
నవరాత్రి ఉత్సవాలలో విశేష పూజలు అందుకున్న గణనాయకుడికి భక్తులు ఘనంగా వీడ్కోలు పలికి గంగమ్మ ఒడికి చేర్చారు. పటాన్చెరు పట్టణం గోనెమ్మ బస్తీ గోనెమ్మ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాన్ని సభ్యులు జై జై గణేశా నినాదాలతో శోభాయాత్రగా నిర్వహించారు.పది రోజుల పాటు పూజల అనంతరం జరిగిన లడ్డు వేలంలో సాయి నవీన్ గెలుచుకున్నారు.బస్తీ వాసులు నృత్యాలు, డప్పు, డీజే చప్పుళ్ల మధ్య వినాయకుడిని నిమజ్జనం చేశారు.పుర వీధుల్లో మహిళల కోలాటం, లేజర్ లైటింగ్, చిన్నారుల నృత్య ప్రదర్శనలు, డీజే పాటలకు యువకుల చిందులతో సందడి నెలకొంది.ఈ సందర్భంగా యూత్ అధ్యక్షుడు మేకల దయానంద్, సభ్యులు గుండమొల్ల రాజు, భూపాల్, నర్సింగరావు, కరుణాకర్, మహేష్, రాజు, లక్ష్మణ్, శీను, కుల సంఘ సభ్యులు, బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## ఇక కారుచౌకగా..

**రూ.3.49 లక్షల వరకు తగ్గించిన సంస్థలు**



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6**

కార్ల ధరలను ఇబ్బడిముబ్బడిగా పెంచేసిన ఆటోమొబైల్ సంస్థలు ప్రస్తుతం తగ్గించే పనిలో పడ్డాయి. వాహనాలపై జీఎస్టీని తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా వాహన సంస్థలు ఒక్కోక్కటి తమ వాహన ధరలను తగ్గిస్తున్నట్టు ప్రకటించాయి. ఇప్పటికే పలు సంస్థలు వాహన ధరలను తగ్గించగా..తాజాగా ఈ జాబితాలోకి మహీంద్రా అండ్ మహీంద్రా, టయోటా, రెనో సంస్థలు చేరాయి. వీటిలో మహీంద్రా ధరలు వెంటనే అమలులోకి రాగా, రెనో, టయోటా ధరలు మాత్రం ఈ నెల 22 నుంచి అమలులోకి రానున్నాయి.

మహీంద్రా అండ్ మహీంద్రా..

దేశీయ ఆటోమొబైల్ దిగ్గజాల్లో ఒకటైన మహీంద్రా అండ్ మహీంద్రా తమ వాహన ధరలను రూ.1.56 లక్షల వరకు తగ్గిస్తున్నట్టు ప్రకటించింది. జీఎస్టీ ప్రయోజనాలను కొనుగోలుదారులకు బదలాయించాలనే ఉద్దేశంతో వాహన ధరలను దించినట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. నూతన ధరలు శనివారం నుంచే అమలులోకి వచ్చాయని పేర్కొంది. దీంతో బొలెరో రూ.1.27 లక్షల వరకు తగ్గనుండగా, ఎక్స్‌యూవీ3ఎక్స్‌వో(పెట్రోల్) రూ.1.4 లక్షలు, ఎక్స్‌యూవీ3ఎక్స్‌వో(డీజిల్) రూ.1.56 లక్షలు, థార్ 2డబ్ల్యూడీ(డీజిల్) రూ.1.35 లక్షలు, థార్ 4డబ్ల్యూడీ(డీజిల్) రూ.1.01 లక్షలు, స్కార్పియో క్లాసిక్ రూ.1.01 లక్షల వరకు దిగిరానున్నాయి.

## పసిడి పరుగో..పరుగు

**రూ.1.10 లక్షలకు చేరువలో తులం ధర**

**గత నెల రోజుల్లో పెరిగిన విలువ రూ.7,500**



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6**

బంగారం భగ..భగ మండుతున్నది. ఇప్పటికే లక్ష రూపాయల పైకి చేరుకున్న పుత్తడి రోజుకొక గరిష్ఠ స్థాయిని తాకుతున్నది. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాలకు డిమాండ్ ఉండటంతోపాటు దేశీయంగా పండుగ సీజన్ కూడా తోడవడంతో పుత్తడి పరుగు పందెంలో విజేతగా నిలుస్తున్నది. ప్రస్తుతం రూ.1.08 లక్షల స్థాయిలో కదలాడుతున్న గోల్డ్ ధర త్వరలో రూ.1.10 లక్షలు అధిగమించే అవకాశాలున్నాయని బులియన్ వర్తకులు చెబుతున్నారు.

దేశ రాజధాని న్యూఢిల్లీలో 24 క్యారెట్ తులం ధర రూ.850 అధికమై రూ.1,08,620కి చేరుకోగా, 22 క్యారెట్ ధర రూ.800 పెరిగి రూ.99,600 పలికింది. ఇటు హైదరాబాద్‌లో 24 క్యారెట్ పదిగ్రాముల బంగారం ధర రూ.870 అధికమై రూ.1,08,490 పలికింది. అంతకుముందు ఇది రూ.1,07,620గా ఉన్నది. అలాగే 22 క్యారెట్ తులం ధర రూ.800 ఎగబాకి రూ.98,650 నుంచి రూ.99,450 పలికింది. మొత్తం మీద గడిచిన నెల రోజుల్లో గోల్డ్ ధర రూ.7,500 ఎగబాకినట్టు అయింది. వచ్చే రెండువారాల్లో అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలుండటంతో పెట్టుబడిదారులు తమ ఇన్వెస్ట్‌మెంట్లను సురక్షితమైన అతి విలువైన లోహాల వైపు మళ్లించడంతో వీటి ధరలు రాకెట్ వేగంతో దూసుకుపోతున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు.

**ఆగని వెండి రేట్లు**

బంగారంతోపాటు వెండి పరుగులు పెడుతున్నది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడంతో కిలో వెండి మరో ఉన్నత శిఖరాలకు చేరుకున్నది. ఇదే క్రమంలో శనివారం కిలో ధర మరో రూ.2 వేలు ఎగబాకి రూ.1,38,000కి చేరుకున్నది. రిటైల్ మార్కెట్‌తోపాటు ఎంసీఎక్స్ ఫ్యూచర్ మార్కెట్లోనూ పుత్తడి రాకెట్ వేగంతో దూసుకుపోతున్నది. ఈ నెల మొదటి నుంచి ఇప్పటివరకు ఎంసీఎక్స్ ఫ్యూచర్ మార్కెట్లో తులం ధర రూ.3 వేలు ఎగబాకి రూ.1,06,856కి చేరుకున్నది. ప్రస్తుతం స్వల్పంగా తగ్గినప్పటికీ ధరలు తీవ్ర హెచ్చుతగ్గుదలకు లోనుకావచ్చునని వర్తకులు హెచ్చరిస్తున్నారు.

## యమహా సరికొత్త ఆర్15

**ప్రారంభ ధర రూ.1.67 లక్షలు**


**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6**

ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ యమహా మోటర్..దేశీయ మార్కెట్లోకి మరో స్పోర్ట్స్ బైకును పరిచయం చేసింది. 2025 ఏడాదికిగాను సంస్థ విడుదల చేసిన ఆర్15 మాడల్‌ను మళ్లీ అధునీకరించి విడుదల చేసింది. ఈ ఆర్15 బైకు ప్రారంభ ధర రూ.1.67 లక్షలు కాగా, గరిష్ఠ ధర రూ.2.01 లక్షలుగా నిర్ణయించింది.ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. ఆర్15 సిరీస్‌లో భాగంగా విడుదల చేసిన ఈ బైకు ఆర్15ఎం, ఆర్15 వెర్షన్ 4, ఆర్15ఎస్ రకాల్లో లభించనున్నది. 155 సీసీ ఫ్యూయల్-ఇంజెక్టెడ్ ఇంజిన్ తయారైన ఈ బైకును అడ్వాన్స్ ఫీచర్ ట్రాక్షన్ కంట్రోల్ సిస్టమ్, అసిస్ట్, స్లిప్పర్ క్లచ్ వంటి ఫీచర్స్ కలిగివున్నాయి.



# స్పోర్ట్స్

## ఆసియా కప్ ఛాన్స్ మిస్.. భారత ఏ జట్టు కెప్టెన్‌గా అయ్యర్..!




ఆసియా కప్ స్క్వాడ్‌లో చోటు దక్కించుకోలేకపోయిన శ్రేయాస్ అయ్యర్ కు సెలెక్టర్లు కొత్త బాధ్యతలు అప్పగించారు. రోహిత్ శర్మ వారసుడిగా వన్డే ఫార్మాట్‌కు కాబోయే సారథి అనిపించుకుంటున్న అయ్యర్‌కు.. భారత 'ఏ' జట్టు కెప్టెన్సీ అప్పగించారు. సెప్టెంబర్‌లో ఆస్ట్రేలియా ఏ జట్టుతో జరుగబోయే రెండు మల్టీ డే మ్యాచ్‌లకు సర్పంచ్ సాబ్ నాయకుడిగా వ్యవహరించనున్నాడు.ఆస్ట్రేలియా ఏ జట్టుతో మ్యాచ్‌లకు శనివారం సెలెక్టర్లు 15 మందితో కూడిన స్క్వాడ్‌ను ప్రకటించారు. ఈ సిరీస్‌లో అయ్యర్‌కు డిప్యూటీగా ధ్రువ్ జురెల్ సహకరించనుండగా.. పలువురు టెస్టు ఆటగాళ్లను బృందలోకి తీసుకున్నారు. ఇంగ్లండ్ పర్యటనలో మెరిసిన సాయి సుదర్శన్, ప్రసిధ్ కృష్ణలతో పాటు దేశవాళీ హీరో అభిమన్యు ఈశ్వరన్, ఐపీఎల్ స్టార్లు ఆయుశ్ బదొని, దేవ్‌దత్ పడిక్కల్ ఉన్నారు.


దేశవాళీలో ముంబై తరఫున ఇరగదీస్తున్న తనుష్ కొతియాన్, సీనియర్ పేసర్ ఖలీల్ అహ్మద్, వికెట్ కీపర్‌గా ఎన్.జగదీశన్ స్క్వాడ్‌లో చోటు సంపాదించారు. ఆసియా కప్ బృందంలో లేని సిరాజ్, కేఎల్ రాహుల్ సైతం రెండో మ్యాచ్‌కు భారత ఏ జట్టుతో చేరుతారని సమాచారం.

భారత ఏ స్క్వాడ్ : శ్రేయాస్ అయ్యర్(కెప్టెన్), అభిమన్యు ఈశ్వరన్, ఎన్.జగదీశన్(వికెట్ కీపర్), సాయి సుదర్శన్, ధ్రువ్ జురెల్ (వైస్ కెప్టెన్, వికెట్ కీపర్), దేవ్‌దత్ పడిక్కల్, హర్ష్ దూబే, ఆయుష్ బదొని, నితీశ్ రెడ్డి, తనుష్ కొతియాన్, ప్రసిధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్, ఖలీల్ అహ్మద్, మానవ్ సుతార్, యశ్ ఠాకూర్.

భారత ఏ, ఆస్ట్రేలియా ఏ జట్ల మధ్య సెప్టెంబర్ 23న తొలి మ్యాచ్ జరుగనుంది. రెండు మల్టీ డే మ్యాచ్‌ల తర్వాత ఇరుజట్లు మూడు వన్డేల్లో తలపడనున్నాయి. కాన్పూర్ వేదికగా సెప్టెంబర్ 30న తొలి వన్డే, అక్టోబర్ 3న రెండో వన్డే, అక్టోబర్ 5న మూడో వన్డే నిర్వహించనున్నారు. స్వదేశంలో వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్‌కు ముందు సిరాజ్, రాహుల్, ప్రసిధ్‌కు ఇవి ప్రాక్టీస్ మ్యాచ్‌లుగా పనికొస్తాయి.

## వరుసగా మూడో గ్రాండ్‌స్లామ్ ఫైనల్..

**చరిత్ర సృష్టించిన టెన్నిస్ స్టార్లు..!**



పురుషుల టెన్నిస్‌లో యువకెరటాలు కార్లోస్ అల్కరాజ్ జన్నిక్ సిన్నర్ జోరు చూపిస్తున్నారు. ఈ సీజన్‌లో భీకర ఫామ్‌లో ఉన్న ఇరువురు మరో గ్రాండ్‌స్లామ్ ఫైనల్ పోరుకు సిద్ధమవుతున్నారు. ఇదివరకే ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్ టైటిల్ పోరులోతలపడిన ఈ కుర్రాళ్లు.. ఇప్పుడు యూఎస్ ఓపెన్ ఫైనల్‌కు దూసుకెళ్లారు. దాంతో.. ఒకే సీజన్‌లో వరుసగా మూడు గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్ ఆడిన ఆటగాళ్లుగా సరికొత్త చరిత్ర లిఖించారీ యంగ్ గన్స్. తద్వారా రోజర్ ఫెదరర్ , రఫెల్ నాదల్ వంటి దిగ్గజాలకు సైతం సాధ్యంకాని రికార్డు నెలకొల్పారీ టాప్ సీడ్స్.అమెరికా వేదికగా జరుగుతున్న యూఎస్ ఓపెన్‌లో ఆద్యంతం అదరగొట్టిన సిన్నర్, అల్కరాజ్ టైటిల్‌కు అడుగుదూరంలో నిలిచారు. శుక్రవారం రాత్రి జరిగిన సెమీఫైనల్లో ఫెలిక్స్ అగర్ అలియస్మిమెను చిత్తు చేశాడు ఇటలీ స్టార్. పొత్తి కడుపులో నొప్పి కారణంగా మ్యాచ్ మధ్యలో బ్రేక్ తీసుకున్న సిన్నర్ 6-1, 3-6, 6-3, 6-4తో ఫెలిక్స్ ఆట కట్టించాడు. రెండో సెమీస్‌లో నొవాక్ జకోవిచ్‌కు చెక్ పెట్టిన అల్కరాజ్ మూడేళ్ల తర్వాత ఫైనల్లో అడుగుపెట్టాడు.ఈసారి 25వ గ్రాండ్‌స్లామ్ కొల్లగొట్టాలనుకున్న జకో కలను చెదరగొడుతూ ఇంటికి పంపించాడు. తొలి సెట్ కోల్పోయినప్పటికీ పట్టువదలని ఈ రెండో సీడ్ 6-4, 7-6(4), 6-2తో జోకర్ కథ ముగించాడు. ఫైనల్ చేరడంతో మూడోసారి సిన్నర్‌తో అమీతుమీకి సిద్ధమయ్యాడీ స్పెయిన్ కుర్రాడు. ఈ ఇద్దరి కంటే ముందు 2012లో జకోవిచ్, నాదల్ మాత్రమే వరుసగా మూడు గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్ ఆడారు.

## సెప్టెంబర్ 28 బీసీసీఐ ఎన్నికలు.. త్వరలోనే నోటిఫికేషన్ విడుదల..!




భారత క్రికెట్ నియంత్రణ మండలి ఎన్నికల తేదీ వచ్చేసింది. సెప్టెంబర్‌లోనే కొత్త కార్యవర్గంను ఎన్నుకోనున్నారు. ఈ ఏడాది జరగబోయే వార్షిక సమావేశం రోజైన సెప్టెంబర్ 28న ఎన్నికలు నిర్వహించేందుకు సన్నాహకాలు చేస్తున్నారు. ముంబైలో ఉన్న బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో ఉదయం 11:30 గంటలకు సమావేశం జరుగనుంది. ఈ మీటింగ్‌లో ఎన్నికల ప్రక్రియ గురించి చర్చించనున్నారు. సెప్టెంబర్ రెండో వారంలో నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశముందనే వార్తలు వినిపిస్తున్నాయి.ఇటీవలే బీసీసీఐ అధ్యక్షుడి స్థానం నుంచి రోజర్ బిన్ని వైదొలగాడు. వయసు 70 ఏళ్లు దాటడంతో అతడు బాధ్యతల నుంచి తప్పుకోగా.. కార్యదర్శిగా ఉన్న రాజీవ్ శుక్లా మధ్యంతర అధ్యక్షుడిగా వ్యవహరించనున్నాడు. అయితే.. ప్రస్తుతం బోర్డులోని సభ్యుల పదవీకాలం కూడా ముగియనున్న నేపథ్యంలో సెప్టెంబర్ 18న ఎన్నికలు జరపాలని బీసీసీఐ తీర్మానించింది. అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శితో పాటు కోశాధికారి ఎంపిక కోసం ఎన్నికలు జరుగనున్నాయి.ఈ సమావేశంలో అపెక్స్ కౌన్సిల్.. ఐపీఎల్, డబ్ల్యూపీఎల్ కోసం గవర్నింగ్ కౌన్సిల్ ఏర్పాటు చేయడంపై కూడా ఈ సమావేశంలో చర్చకు రానుందని సమాచారం. అపెక్స్ కౌన్సిల్‌లో బీసీసీఐ సాధారణ కార్యవర్గంలోని సభ్యుడు ఒకరు.. భారత క్రికెట్ అసోసియేషన్ నుంచి ఇద్దరు సభ్యులుగా ఉంటారని బీసీసీఐ వర్గాలు చెబుతున్నాయి.



# బాలీవుడ్‌లో బంపరాఫర్

గత ఏడాది 'లక్కీ భాస్కర్'తో భారీ విజయాన్ని అందుకున్న మీనాక్షి చౌదరి.. ఈ ఏడాది 'సంక్రాంతికి వస్తున్నాం'తో ఏకంగా మూడొందల కోట్ల విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. అంత విజయం తర్వాత మీనాక్షి ఫుల్ బిజీ అయిపోతుందని అంతా అనుకున్నారు. కానీ ఆమె ఖాతాలో నవీన్ పోలిశెట్టి 'అనగనగా ఒకరోజు' సినిమా మినహా మరో సినిమా లేదు.అంత సక్సెస్ తర్వాత స్పీడ్ పెరగాలి కానీ.. తగ్గడమేంటి అని అంతా అనుకుంటున్న తరుణంలో.. భారీ అవకాశం ఈ అందాలభామను వరించింది. అయితే.. ఆ అవకాశం టాలీవుడ్‌లో కాదు, బాలీవుడ్‌లో. బాలీవుడ్ హిట్ ఫ్రాంచైజీ 'ఫోర్స్' మూడో భాగం తెరకెక్కించేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. జాన్ అబ్రహం హీరోగా నటిస్తున్న ఈ సినిమాలో కథానాయికగా మీనాక్షి చౌదరి ఎంపికయ్యారు. మీనాక్షితో ఈ టీమ్ చర్చలు జరపడం, ఆమెకు కథ నచ్చి అంగీకరించడం కూడా జరిగిపోయింది. ఓ ప్రస్టేజియస్ ప్రాజెక్ట్ ద్వారా బాలీవుడ్‌లో హీరోయిన్‌గా లాంచ్ అవుతున్నందుకు మీనాక్షి చౌదరి ఆనందానికి అవధుల్లేవ్. విపుల్ అమృత్‌లాల్‌షా, జాన్ అబ్రహం కలిసి నిర్మిస్తున్న ఈ సినిమాకు దర్శకుడు నిషికాంత్ కామత్.





# మరో ప్రాజెక్ట్‌కు అల్లరి నరేశ్ శ్రీకారం

ఒకవైపు ఆల్కాహాల్ సినిమాను విడుదలకు సిద్ధం చేస్తునే మరో కొత్త సినిమాను ప్రారంభించాడు అల్లరి నటుడు నరేష్. తన కెరీర్‌లో 65వ సినిమాగా రాబోతున్న ఈ ప్రాజెక్ట్ నేడు పూజా కార్యక్రమాలతో అధికారికంగా ప్రారంభమైంది. ఈ చిత్రం పౌరాణిక హాస్యభరిత కథాంశంతో రూపొందుతున్నట్లు- చిత్ర బృందం తెలిపింది. ఈ సినిమా ప్రారంభోత్సవానికి పలువురు సినీ ప్రముఖులు హాజరుకాగా.. యువ నటు-డు అక్కినేని నాగ చైతన్య క్లాప్ కొట్టాడు. దర్శకుడు బాబీ కెమెరా స్విచ్ ఆన్ చేయగా.. తొలి షాట్‌కి దర్శకుడు వి.ఐ. ఆనంద్ దర్శకత్వం వహించారు. దర్శకులు వశిష్ట, విజయ్ కుమార్, మరియు రామ్ అబ్బరాజు స్క్రిప్ట్‌ను చిత్ర బృందానికి అందజేశారు. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది. ఈ చిత్రానికి చంద్రమోహన్ సి దర్శకుడు కాగా, హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దంమరియు అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై లెమన్ ప్రసాద్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సంగీత దర్శకుడిగా చైతన్ భరద్వాజ్, ఎడిటర్‌గా ఛోటా కె. ప్రసాద్ వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంలో అల్లరి నరేష్ సరికొత్త పాత్రలో కనిపించనున్నట్లు- సమాచారం

# సూర్య సినిమాలో సీనియర్ హీరోయిన్.

## ఫుల్ ఖుష్ అవుతున్న ఫ్యాన్

కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వం వహించిన రెట్రో చిత్రం విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ చిత్రంలో స్టార్ హీరో సూర్య ప్రధాన పాత్రలో నటిస్తుండగా, పూజా హెగ్డే హీరోయిన్ గా చేస్తుంది. ఈ చిత్రం మే 1, 2025న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమా తర్వాత, సూర్య తన 45 చిత్రంలో నటిస్తున్నాడు. ఆర్జే బాలాజీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం షూటింగ్ చివరి దశలో ఉంది. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రంలో సూర్యకు జోడీగా.. త్రిష నటిస్తుంది. సూర్య, త్రిష ఇద్దరూ ఈ సినిమాలో న్యాయవాదులుగా కనిపించనున్నారు. ఆసక్తికర కథతో ఆర్జే బాలాజీ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమా తర్వాత సూర్య తమిళ చిత్రం వాడివాసల్ లో నటించనున్నాడని తెలిసిందే. వీటితో పాటు లక్కీ భాస్కర్, సార్ లాంటి బ్లాక్ బస్టర్ సినిమాలకు దర్శకత్వం వహించిన టాలీవుడ్ దర్శకుడు వెంకీ అట్లూరి డైరెక్షన్లో కూడా ఓ సినిమా చేయనున్నారు సూర్య. ఈ సినిమాకు సంబంధించిన ప్రకటనలు త్వరలో వెలువడతాయని కూడా చెబుతున్నారు. ఇప్పటికే ఈ సినిమా గురించి కొలువుడ్ లో ఆసక్తికర టాక్ నడుస్తుంది. ఇంకా అనౌన్స్ కానీ ఈ సినిమాలో నటించే హీరోయిన్ గురించి కూడా ఇప్పుడు టాక్ వినిపిస్తుంది. ఈ చిత్రంలో నటి మమిత బైజు కూడా ఒక ప్రధాన పాత్రలో నటించనుంది. వీరిద్దరూ గతంలో దర్శకుడు బాలా దర్శకత్వం వహించిన వనంగాన్ చిత్రంలో నటించారు. కానీ ఆ సినిమా నుంచి అనివార్యకారణాల వల్ల సూర్య, మమిత ఇద్దరూ తప్పుకున్నారు. ఇదిలా ఉంటే ఇప్పుడు సూర్య సినిమాలో మరో హీరోయిన్ కూడా నటిస్తుందని టాక్ వినిపిస్తుంది. ఆమె ఎవరో కాదు సూర్య సతీమణి జ్యోతిక.. ఇప్పుడు ఇదే వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. ఈ సినిమాలో సూర్య, జ్యోతిక కలిసి నటిస్తున్నారని వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. మరి ఈవార్తల్లో వాస్తవమెంత అన్నది తెలియాల్సి ఉంది. సూర్య, జ్యోతిక కలిసి నటించనున్నారని అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.





# ఓటీటీలోకి కన్నడ బ్లాక్ బస్టర్ 'సు ఫ్రమ్ సో'..

## స్ట్రీమింగ్ ఎక్కడంటే!

కన్నడలో చిన్న సినిమాగా విడుదలై బ్లాక్ బస్టర్ అందుకున్న 'సు ఫ్రమ్ సో' చిత్రం తాజాగా ఓటీటీలోకి రాబోతుంది. ప్రముఖ ఓటీటీ వేదిక జియో హాట్‌స్టార్‌లో సెప్టెంబర్ 09 నుంచి తెలుగుతో పాటు కన్నడ, మలయాళం, తమిళం భాషల్లో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు ప్రకటించింది. రాజ్ బి శెట్టి సహ-నిర్మాతగా వ్యవహరించిన ఈ చిత్రాన్ని నూతన దర్శకుడు జెపి తుమినాడ్ దర్శకత్వం వహించారు. హారర్ కామెడీ జానర్‌లో తెరకెక్కిన ఈ చిత్రం, వినూత్నమైన కథాంశంతో కామెడీ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కింది. ఇదే సినిమాను తెలుగులో విడుదల చేయగా.. ఇక్కడ కూడా మంచి విజయాన్ని అందుకుంది.ఈ సినిమా కథ విషయానికి వస్తే.. దక్షిణ కన్నడ ధర్మస్థలికి దగ్గరలో ఉన్న ఓ గ్రామంలో ఈ కథ మొదలవుతుంది. గ్రామంలో నివసించే అశోక్ (జె.పి. తుమినాడ్) ఒక పెళ్లి వేడుకలో పాల్గొని తిరిగి వస్తుండగా, తాను ప్రేమించిన యువతి ఇంటి దగ్గర ఆగుతాడు. అదే సమయంలో ఆమె బాత్రూంలో నుంచి మాటలు వినిపించడంతో దొంగచాటుగా ఆమెను చూసేందుకు ప్రయత్నిస్తాడు. అయితే, అతనిని చూసిన ఇద్దరు వ్యక్తులు పట్టుకోవడంతో, వారికి దయ్యం పట్టినట్లుగా డ్రామా చేసి అక్కడినుంచి తప్పించుకుంటాడు. తెల్లవారేసరికి అశోక్‌కు దయ్యం పట్టిందని ఆ ఊరిలో వార్త బాగా వ్యాపించిపోతుంది. దీంతో, అశోక్‌లోని దయ్యాన్ని వదిలించేందుకు గ్రామానికి చెందిన పెద్ద రవన్న (షానిల్ గౌతమ్) నగరంలో ఉన్న స్వామీజీ కరుణాజీ (రాజ్ బి శెట్టి)ని పిలిపిస్తాడు. నిజంగానే అశోక్‌కు దయ్యం పట్టిందా? కరుణాజీ స్వామీజీ దయ్యాన్ని వదిలించారా? దయ్యం పట్టినట్లుగా అశోక్ చేసిన డ్రామా వల్ల ఆ ఊరి ప్రజలు ఎలా ఇబ్బందులు పడ్డారు? అనేది తెలియాలంటే ఈ సినిమా చూడాల్సిందే.

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492